

ప్రజాస్పూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 02-03-2026 | సంపుటి - 26 | సంచిక -281 | రూ : 4 | పేజీలు: 8


## సీఎం ప్రజావాణికి రెండేళ్లు..
# 47 వేల దరఖాస్తులు పరిష్కారం



5లో

- ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు
- పరిష్కారం కాని దరఖాస్తులు 47,687
- అక్కడికక్కడే సమస్యల పరిష్కారం
- సీఎం ప్రజావాణిపై ప్రజల్లో భరోసా
- చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ





## 15వ తేదీలోపు పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు

- దళారుల 'దగా'పై ఉక్కుపాదం బాధితులకు 'సర్కారు' దన్ను
- 'అండగా నిలుస్తాం.. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది' : వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి హామీ

2లో

# 99 రోజుల పార్టీ ప్రణాళిక

- 'గ్రేటర్' ఎన్నికలే లక్ష్యంగా సీఎం వ్యూహం
- రంగారెడ్డిపైనా పట్టుకు స్కెచ్
- బలహీనంగా ఉన్న చోట పుంజుకునేందుకు ప్రణాళికలు
- మున్సిపోల్స్‌లో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ కార్యక్రమాల ఏకరువు.. పార్టీ బలోపేతమే లక్ష్యం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ శరవేగంగా పావులు కదుపుతోందా? అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు అత్యధిక స్థానాలు కట్టబెట్టిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో హస్తం పార్టీని బలోపేతం చేయటంపై తరువాయి 2లో

## ఉప్పందించింది అమెరికా..
# దాడి చేసింది ఇజ్రాయెల్

- నెలలుగా ఖమేనీ కదలికలపై కన్నేసిన అగ్రరాజ్యం

దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్రనాయకుడు ఖమేనీ.. ప్రత్యర్థి దాడిలో అంత సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు దాదాపు ఖాయమని కొద్దిరోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోలేదు. తరువాయి 2లో





## ఖమేనీ ఇంటిపై
# 30 బాంబులు..

- మొత్తం ఆవరణ శిథిలావస్థకు...
- ఇజ్రాయిల్, అమెరికా వేసిన బాంబులు ఏమిటి?

టెహ్రాన్: ఖమేనీని లక్ష్యంగా చేసుకున్న దాడిలో ఇజ్రాయిల్ , అమెరికా జీబీయూ28 లేజర్‌గైడెడ్ పెనెట్రేటర్ బాంబులను ఉపయోగించి ఉండవచ్చు. ఖమేనీ కాంప్లెక్స్‌పై ఇజ్రాయిల్ ఫైటర్ జెట్‌లు మొత్తం 30 బాంబులను జారవిడిచాయని వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. జీబీయూ..28 అనేది దఢమైన భవనాలు , భూగర్భ గదులను నాశనం చేయడానికి రూపొందించ బడిన భారీ, 2268 కిలోగ్రాముల బంకర్‌బస్టర్ బాంబు. ఖమేనీ కాంప్లెక్స్ సురక్షితంగా, బలవర్థకంగా ఉంది, తరువాయి 2లో

## ఇరాన్..
# భవితవ్యమేంటి..?

- వీలైనంత త్వరలోనే కొత్త సుప్రీం లీడర్ నియామకం
- రేసులో ఖమేనీ కుమారుడు సహా పలువురు సీనియర్లు



ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో తరువాయి 2లో

## అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

- రాజధాని నగరాన్ని జ్యుడిషియల్ హబ్‌గా మారుస్తాం
- అందుకు సహకరించాలని సీజేఐకి సీఎం చంద్రబాబు వినతి

2లో



# రాజధానికి.. 'న్యాయ' సొబగులు..!


2లో

- అమరావతిలో పలు నిర్మాణాలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శ్రీకారం
- జ్యుడిషియల్ అకాడమీ, హైకోర్టు అతిథిగృహానికి శంకుస్థాపన
- హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయానికి ప్రారంభోత్సవం
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే, న్యాయమూర్తులు

## కుంభకోణాలకు పెట్టింది పేరు డీఎంకే

- తమిళనాడులో వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమే
- రాజ్యాంగ విలువలు కాపాడేందుకు తపిస్తున్నాం
- మదురై సభలో ప్రధాని నరేంద్ర మోదీ

చెన్నై: తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధికార డీఎంకేపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ప్రభుత్వం కుంభకోణాలకు పెట్టింది పేరని, అందులోని మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని ధ్వజమెత్తారు. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని, వచ్చే ఎన్నికల్లో తరువాయి 2లో



# కుంభకోణాలకు పెట్టింది పేరు డీఎంకే

చెన్నై: తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధికార డీఎంకేపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ప్రభుత్వం కుంభకోణాలకు పెట్టింది పేరని, అందులోని మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని ధ్వజమెత్తారు. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని, వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పుదుచ్చేరి, తమిళనాడులోని మదురైలో ఆదివారం నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పుదుచ్చేరిలో రూ.2,700 కోట్లు, తమిళనాడులో రూ.4,400 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు కొత్తవాటికి శంకుస్థాపన చేశారు. మదురైలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. "ఇక్కడి డీఎంకే మంత్రులు ఉద్యోగుల బదిలీల్లో రూ.365 కోట్లు, ఉద్యోగ నియామకాల్లో రూ.900 కోట్లు, కాంట్రాక్టుల్లో రూ.1000 కోట్లు, ఇసుక అక్రమ రవాణాలో రూ.4,700 కోట్లు, మద్యంలో రూ.40వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారు. ఇకపై డీఎంకే ప్రభుత్వం కొనసాగేందుకు అర్హత లేదు. ఆరు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను అధికారానికి దూరంగా ఉంచిన ఏకైక రాష్ట్రం తమిళనాడే. కచ్చతీవును శ్రీలంకకు ఇచ్చిందే కాంగ్రెస్ అయితే, డీఎంకే వారికి మద్దతిచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వీరిని ఓటుతో సాగనంపాలి" అని పేర్కొన్నారు.

**మాది ప్రజాపక్ష పాలన**

అంబేద్కర్ అద్భుతమైన రాజ్యాంగాన్ని ఇచ్చారని గుర్తుచేసిన ప్రధాని మోదీ.. తాను ప్రతిక్షణం ఆ రాజ్యాంగ విలువల్ని కాపాడటానికే పనిచేస్తున్నానన్నారు. తమిళనాడులోని డీఎంకేకు చెందిన ఓ వ్యక్తి మాత్రం 'మీరంటే నాకు, నా తండ్రికి భయం లేదు' అంటున్నారని గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలతో వారు తనను కించపరిచినట్లు భావించలేదని, తన విలువలకు గుర్తింపు ఇచ్చినట్లు, గౌరవించినట్లు భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. తాజాగా యూరప్ దేశాలతో మన దేశం ఒప్పందం కుదుర్చుకుందని, ఇది తమిళనాడుకు పెద్ద అవకాశమని వివరించారు. ఇక్కడి ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ దక్కుతుందని, లక్షల ఉద్యోగాలు దొరుకుతాయని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం మాత్రమే ప్రజాపక్ష పాలన అందిస్తోందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, పుదుచ్చేరి ఎల్జీ కె.కైలాషనాథన్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి, అక్కడి స్పీకర్ ఆర్.సెల్వం, హోంమంత్రి నమశ్శివాయం, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ఎల్.మురుగన్, తమిళనాడు మంత్రి ఈవీ వేలు, ఎన్డీయే నేతలు పాల్గొన్నారు. తరువాత మదురై సమీపంలోని తిరుప్పరకుండ్రం ఆరుల్మిగు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రధాని మోదీ పూజలు చేశారు.

# ఇరాన్ భవితవ్యమేంటి..?

ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం.

**ముగ్గురు సభ్యుల నాయకత్వ మండలి**

సుప్రీం లీడర్ లేనప్పుడు ఇరాన్ పాలనా వ్యవహారాలను ముగ్గురు సభ్యులతో కూడిన నాయకత్వ మండలి చూసుకుంటుంది. ఇందులో దేశాధ్యక్షుడు, న్యాయ వ్యవస్థ అధిపతితో పాటు మరో సభ్యుడు భాగంగా ఉంటారు. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హొసేన్ మొహ్సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు.

**సుప్రీం లీడర్ నియామకానికి కమిటీ**

ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎవరన్నది ఇప్పుడు అత్యంత ఆసక్తికర ప్రశ్న. ఈ నియామకాన్ని చేపట్టేందుకు 88 మంది షియా మతపెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) ఉంటుంది. సుప్రీం లీడర్‌కు ఏమైనా జరిగినప్పుడు వీలైనంత త్వరగా కొత్త అధినాయకుణ్ని నియమించాల్సిన బాధ్యత ఈ కమిటీదేనని ఇరాన్ చట్టాలు చెబుతున్నాయి. ఇందులోని సభ్యులను ప్రత్యక్ష ప్రజా ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. గెలిచినవారు 8 ఏళ్లపాటు కమిటీలో ఉంటారు. మెజారిటీ ఓటింగ్ ద్వారా సుప్రీం లీడర్‌ను వీరు ఎన్నుకుంటారు. సుప్రీం లీడర్‌ను తొలగించే అధికారం కూడా ఈ కమిటీకి ఉంటుంది. అయితే ఇప్పటివరకూ అలాంటి తొలగింపు ఎన్నడూ చోటుచేసుకోలేదు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది.

**ఖమేనీ కుమారుడికి అవకాశం?**

ఇబ్రహీం రైసీ ఇరాన్ అధ్యక్షుడిగా ఉన్నంత కాలం.. తదుపరి సుప్రీం లీడర్ ఆయనే అనే ప్రచారం జరిగింది. అయితే 2024 మేలో హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణించారు. దీంతో ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు.

# అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నవించారు. అవకాశమిస్తే నిర్మాణాల బాధ్యత తీసుకొని, అన్నివిధాలా సహకరిస్తామన్నారు. రాజధానిలో నిర్మించే 'జస్టిస్ సిటీ'ని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని.. అందుకు అవసరమైన సూచనలు, సలహాలిచ్చి మార్గదర్శకత్వం చేయాలని సీజేఐని కోరారు. జ్యుడిషియల్ అకాడమీ, మధ్యవర్తిత్వ కేంద్రం, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భవనం లాంటివన్నీ ఈ 'జస్టిస్ సిటీ'లో ఉంటాయని చెప్పారు. న్యాయవ్యవస్థ, పరిపాలనకు సంబంధించిన ప్రతి విభాగం ఇక్కడ ఉండేలా చూస్తామన్నారు. అమరావతిని జ్యుడిషియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో ఆదివారం 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి చర్చ' నిర్వహించారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. సీజేఐ సూచనల మేరకు ఏపీ జ్యుడిషియల్ అకాడమీ కోసం మరికొంత భూమి కేటాయిస్తామని సీఎం తెలిపారు. సీజేఐ సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రోజంతా అమరావతిలో, తిరుపతిలో గడపటం ఆనందంగా ఉందని, రాష్ట్ర చరిత్రలో ఇదో చారిత్రక సందర్భమన్నారు. సీఎం ప్రసంగంలోని ప్రధానాంశాలు... మధ్యవర్తిత్వంతో ఏదైనా సాధించొచ్చు.. మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారమైతే ఒక్కో కేసుకు మధ్యవర్తులకు ప్రస్తుతం రూ.3 వేలు చెల్లిస్తున్నాం. దీన్ని రూ.10 వేలకు పెంచుతున్నాం. కేసులు పరిష్కారం కాకపోయినా సరే మధ్యవర్తిత్వం వహించినందుకు రూ.3 వేలు చెల్లిస్తాం. సంప్రదింపుల ద్వారా చేపట్టిన అత్యుత్తమ ప్రాజెక్టు రాజధాని అమరావతి. ప్రపంచంలో ఇలాంటిది ఇంకెక్కడా లేదు. సంప్రదింపులతో 29వేల మంది రైతుల నుంచి 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా సమీకరించి రాజధానిని నిర్మిస్తున్నాం. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్. ప్రతి ఒక్కరూ అమరావతిలో ఓ ఇంటి స్థలం ఉంచుకోండి. ఇక్కడ అత్యుత్తమ జీవన ప్రమాణాలుంటాయి. కాలుష్యరహిత నగరంగా అమరావతి ఉంటుంది.

**జస్టిస్, అభివృద్ధి కలిసి పనిచేయాలి...**

న్యాయం అందటంలో జాప్యం జరిగితే.. అభివృద్ధి పురోగతిలోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. జస్టిస్, అభివృద్ధి కలిసి పనిచేయాలి. విధాననిర్ణేతలుగా మేము వేగవంతమైన అభివృద్ధి కోరుకుంటాం. దానికి జ్యుడిషియరీ సహకరిస్తే దేశం అగ్రగామిగా మారుతుంది. నా చిన్నతనంలో మా నాన్న మధ్యవర్తిత్వం ద్వారా అనేక వివాదాలు పరిష్కరించారు. ఆయన చదువుకోలేదు. అయినా చుట్టుపక్కలుండే 2030 గ్రామాల ప్రజలకు ఆయనపై విశ్వాసం ఉండేది.

# 99 రోజుల పార్టీ ప్రణాళిక

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ శరవేగంగా పావులు కదుపుతోందా? అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు అత్యధిక స్థానాలు కట్టబెట్టిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో హస్తం పార్టీని బలోపేతం చేయటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారా? అంటే అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు నిర్వహించిన ప్రజా పాలన, బేగంపేటలో నిర్వహిస్తోన్న ప్రజావాణి కార్యక్రమాలు ఉండగా--- ఇప్పుడు మళ్లీ '99 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్' అంటూ సర్కారు ప్రకటించటం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అసెంబ్లీ, పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీ, మున్సిపల్ ఎలక్షన్లలో గెలుపు జెండాను ఎగరేసినప్పటికీ ఇప్పటికిప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు అధికార పార్టీ సంసిద్ధం కాకపోవటాన్నిబట్టి ఈ వాదన మరింత బలపడుతోంది. దీన్ని మరింత లోతుగా పరిశీలిస్తే--- 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' పేరుతో రాష్ట్రప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 99 రోజులపాటు నిర్వహించే ఈ ప్రోగామ్---తమకు అత్యంత కీలకమని, ప్రతీ రోజూ అమూల్యంగా భావించి పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. అయితే ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమమే కాదని, పార్టీని బలోపేతం చేసుకునేందుకు ఉద్దేశించిన ప్రోగ్రామ్ అని కాంగ్రెస్ నేతలే చెబుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ బలంగా ఉన్నట్టు కనబడుతోంది. కానీ అసెంబ్లీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎలక్షన్ల వరకూ పరిశీలిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో అది పట్టు సాధించలేకపోయింది. వాస్తవానికి ఇక్కడ ఆ పార్టీకి సరైన లీడర్లుగాని, క్యాడర్‌గానీ లేదు. ఈ ప్రాంతంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేదు. ఫలితంగా మున్సిపోల్స్‌లో ఇక్కడ బీఆర్ఎస్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. మరోవైపు పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికల్లో కొన్ని చోట్ల ఎదురైన అనుభవాలు కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదు. సీనియర్ మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న పలు మున్సిపల్ ప్రాంతాల్లో హస్తం పార్టీ అపజయం పాలైంది. మంత్రి గడ్డం వివేక్ బాధ్యుడిగా ఉన్న క్యాతనపల్లిలో ఆ పార్టీ ఓటమి పాలైంది. మరో మంత్రి వాకిటి శ్రీహరి నియోజకవర్గ పరిధిలోని అమరచింత మున్సిపాల్టీ బీఆర్ఎస్ ఖాతాలో పడింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న వేములవాడలో కూడా కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. నారాయణపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఉన్నప్పటికీ--- అక్కడ బీజేపీ గెలిచింది.

ఉప్పందించింది అమెరికా..

# దాడి చేసింది ఇజ్రాయెల్

దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్రనాయకుడు ఖమేనీ.. ప్రత్యర్థి దాడిలో అంత సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు దాదాపు ఖాయమని కొద్దిరోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోలేదు. అమెరికా నుంచి అందుకున్న ఒక రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి.

**గత ఏడాది నుంచే**

గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది.

# ఖమేనీ ఇంటిపై 30 బాంబులు

టెహ్రాన్: ఖమేనీని లక్ష్యంగా చేసుకున్న దాడిలో ఇజ్రాయిల్ , అమెరికా జీబీయూ 28 లేజర్ గైడెడ్ పెనెట్రేటర్ బాంబులను ఉపయోగించి ఉండవచ్చు. ఖమేనీ కాంప్లెక్స్‌పై ఇజ్రాయిల్ ఫైటర్ జెట్‌లు మొత్తం 30 బాంబులను జారవిడిచాయని వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. జీబీయూ..28 అనేది దఢమైన భవనాలు , భూగర్భ గదులను నాశనం చేయడానికి రూపొందించ బడిన భారీ, 2268 కిలోగ్రాముల బంకర్‌బస్టర్ బాంబు. ఖమేనీ కాంప్లెక్స్ సురక్షితంగా, బలవర్ధకంగా ఉంది, కాబట్టి ఈ దాడిలో జీబీయూ 28 వంటి చొచ్చుకుపోయే బాంబులను ఉపయోగించారని నిపుణులు విశ్వసిస్తున్నారు. నివేదికలో "30 బాంబులు" మాత్రమే ప్రస్తావించినప్పటికీ, లక్ష్యాన్ని బట్టి జీబీయూ 28 వాడకం సాధ్యమే.

*** ఒకే విమానం ఒకేసారి 30 బాంబులను మోయగలదా?**

ఒకే విమానం 30 జీబీయూ 28 బాంబులను మోయలేదు. ఈ బాంబు చాలా బరువైనది . పొడవుగా ఉంటుంది. ఇజ్రాయిల్ ఎఫ్15 ఆఏఏఎం ఫైటర్ జెట్‌లు సాధారణంగా ఒకటి లేదా రెండు జీబీయూ 28 బాంబులను మాత్రమే మోయగలవు. 30 బాంబులను వేయడానికి బహుళ విమానాలను ఉపయోగించారు.

*** ఖమేనీని చంపడానికి ఉపయోగించిన వెపన్**

15 నుంచి 20 ఇజ్రాయిల్ ఎఫ్15లు , ఇతర ఫైటర్ జెట్‌లు ఈ దాడిలో పాల్గొని ఉండవచ్చు. ప్రతి విమానం ఒకటి లేదా రెండు భారీ బాంబులను విసిరి, మొత్తం 30 బాంబులను తయారు చేసింది. పట్టపగలు కచ్చితమైన దాడి చేయడానికి ఈ సంఖ్యలో విమానాలు అవసరం.

*** జీబీయూ-28 బాంబు ప్రత్యేక లక్షణాలు ఏమిటి?**

జీబీయూ 28 ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన లేజర్‌గైడెడ్ బంకర్‌బస్టర్ బాంబులలో ఒకటి. దీని బరువు సుమారు 2268 కిలోగ్రాములు , సుమారు 19 అడుగులు (5.8 మీటర్లు) పొడవు ఉంటుంది. ఇది 286 కిలోగ్రాముల అధిక పేలుడు పదార్థాలతో లోడ్ చేయబడింది. ఈ బాంబు లేజర్ మార్గదర్శకత్వంలో పనిచేస్తుంది, పైలట్ లేజర్‌ను నేలపై గురిపెట్టడం ద్వారా చాలా కచ్చితత్వంతో గురిపెట్టడానికి వీలు కల్పిస్తుంది. దీని అత్యంత ముఖ్యమైన లక్షణం ఏమిటంటే ఇది 2030 అడుగుల లోతు వరకు బలమైన కాంక్రీటులోకి చొచ్చుకుపోగలదు. ఇది లోతైన బంకర్లను లేదా భూగర్భ గదులను నాశనం చేయగలదు. ఈ బాంబు ప్రత్యేకంగా శత్రు కమాండ్ సెంటర్లు , నాయకత్వ బంకర్లను నాశనం చేయడానికి రూపొందించబడింది.

*** ఈ బాంబు చివరిగా ఎప్పుడు ఉపయోగించబడింది?**

జీబీయూ 28ని మొదట 1991 గల్ఫ్ యుద్ధంలో ఉపయోగించారు. అమెరికా దీనిని ఇరాక్‌లోని సద్దాం హుస్సేన్ బంకర్లపై వేసింది. తరువాత దీనిని 1999లో కొసావో యుద్ధంలో ,2003లో ఇరాక్ యుద్ధంలో ఉపయోగించారు. ఇజ్రాయిల్ కూడా ఈ బాంబును కలిగి ఉంది, గాజా , లెబనాన్‌లోని బంకర్లపై దీనిని ఉపయోగించింది. ఇటీవలి సంవత్సరాలలో, ఇరాన్ , దాని మిత్రదేశాలపై జీబీయూ 28ని ఉపయోగిస్తున్నట్టు నివేదికలు వచ్చాయి. దీని సామర్థ్యాలు దీనిని ఖమేనీ దాడికి సరిగ్గా సరిపోతాయి.

# రాజధానికి 'న్యాయ' సొబగులు..!

అమరావతి: ఏపీ న్యాయవ్యవస్థలో కీలక ఘట్టాలకు రాజధాని అమరావతి వేదికైంది. అమరావతికి శోభతెచ్చేలా పలు నిర్మాణాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శ్రీకారం చుట్టారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతి నుంచి విజయవాడకు చేరుకున్న సీజేఐ.. గన్నవరం విమానాశ్రయం నుంచి నేరుగా అమరావతికి చేరుకున్నారు. పలు కార్యక్రమాల్లో తీరికలేకుండా గడిపారు. ముఖ్య అతిథిగా హాజరై తుళ్లూరు మండలం పిచ్చుకలపాలెంలో ఏర్పాటుకానున్న 'ఏపీ జ్యుడిషియల్ అకాడమీ' నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

**పూర్ణకుంభంతో స్వాగతం**

అంతకుముందు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులకు వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ సూర్యకాంత్ జ్యుడిషియల్ అకాడమీకి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యుడిషియల్ అకాడమీ, రాజధాని అమరావతి అభివృద్ధి పనులపై రూపొందించిన వీడియో డాక్యుమెంట్‌ను అతిథులు తిలకించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, జీఏడీ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తంకుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్రకుమార్, హైకోర్టు రిజిస్ట్రార్లు, పలువురు న్యాయాధికారులు ఈ పాల్గొన్నారు.

# 15వ తేదీలోపు పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు

ఖమ్మం : 'అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి.. ఈ ప్రభుత్వం మీది. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది. అర్హులైన ప్రతీ పేదవాడికి ఈ నెల 15 లోపు ఇండ్ల స్థలాల పట్టాలతో పాటు రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం' అని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసానిచ్చారు. ఖమ్మం ఐడీఓసీలో ఆదివారం బాధితులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు.

*** డబ్బులు వసూలు చేయించి ఇస్తామని హామీ..**

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేండ్లుగా దళారుల ఉచ్చులో చిక్కి, నిరుపేదలు అనుభవిస్తున్న నరకయాతన మంత్రి ఎదుట వెలుగుచూసింది. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లోనూ రూ. 30 వేల నుంచి రూ. 8 లక్షల వరకు అప్పులు చేసి దళారులకు చెల్లించామని మంత్రి ఎదుట బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇల్లు కట్టుకున్నాక అధికారులు వచ్చి కూల్చేయడంతో తామంతా దిక్కుతోచని స్థితిలో పడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్క పైసా కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదని, దళారుల నుంచి డబ్బును రికవరీ చేయిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

*** చీకటి బతుకుల నుంచి వెలుగు కాలనీల వైపు..**

గత 9 నెలలుగా కరెంటు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక చీకట్లో మగ్గుతు న్నామని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి.. కేవలం ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమే కాకుండా, కొత్తగా నిర్మించే కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రయినేజీతో పాటు అంగన్‌వాడీ, పాఠశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా బాధితులను గుర్తించి, వారి ప్రాంతాల్లోనే పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

# పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్

* నేటి ఆధునిక తరంలో సైన్స్ ముఖ్యం – ప్రిన్సిపాల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ పట్టణంలోని నెహ్రూ నగర్‌లో ఉన్న నారాయణ విద్యాసంస్థలు కు చెందిన నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం ఘనంగా అకాడమిక్ ఫెయిర్ (సైన్స్ ఫెయిర్) నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మొబైల్ హాస్పిటల్, మ్యాథ్స్ పార్క్, న్యాయశాఖ నమూనాలు, రోబోటిక్స్, సౌరశక్తి వినియోగం, బ్రహ్మోస్ క్షిపణి, వ్యవసాయ సాంకేతికత వంటి పలు సృజనాత్మక, వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను విద్యార్థులు స్పష్టంగా వివరించడం సందర్శకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలడానికి సైన్స్ ముఖ్యమైన సాధనమని తెలిపారు. విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నారాయణ విద్యాసంస్థల ఏజీఎం ఎస్. రాంకీ, ఆర్.ఐ. క్రాంతి కుమార్, కో ఆర్డినేటర్లు ప్రవీణ్ కుమార్, వినోదలక్ష్మీ, నీలిమ, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సామాజిక బాధ్యతగా సహకారం

* విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన డా. ప్రభుదయాల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సామాజిక బాధ్యతతో బీదల పట్ల ప్రత్యేక ఔదార్యం చూపుతూ ముందుకు సాగుతున్న కొత్తగూడెం మండల మాజీ విశ్రాంత విద్యాశాఖ అధికారి డా. ప్రభుదయాల్ ఆదర్శంగా నిలిచారు. ఆదివారం పాత కొత్తగూడెంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక మెనూతో భోజనం ఏర్పాటు చేసి, వారితో సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల విద్యావసరాలను స్వయంగా తెలుసుకుని, అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన చిన్ననాటి అనుభవాలను స్మరించుకుంటూ, ఎవరికీ ఇబ్బందులు రాకుండా తన వంతు సహకారం అందించడం తన ధ్యేయమని చెప్పారు. విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించి, లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. చదువు సంబంధిత ఎలాంటి అవసరాలున్నా తనకు తెలియజేయాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు నరేష్, శంకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## స్వంత నిధులతో పైపు లీకేజీ పనుల పూర్తి



జిన్నారం, ప్రజాస్ఫూర్తి : జిన్నారంలోని 4వ వార్డులో గత కొన్ని నెలలుగా నెలకొన్న సమస్యను తీర్చారు కౌన్సిలర్ స్వప్నరాజేందర్ రెడ్డి. తన స్వంత నిధులతో వాటర్ లీకేజీ ఉండటంతో వాటర్ కలుషితం అవుతుంది. ఎన్నో రోజులుగా సమస్య ఉండడంతో కలుషిత నీరు బయటకు వస్తున్న సమస్యను నూతన కౌన్సిలర్ కి విన్నవించారు. వెంటనే స్పందించిన కౌన్సిలర్ స్వప్నరాజేందర్ రెడ్డి. స్వంత నిధులను వెచ్చించి మున్సిపల్ సిబ్బంది సహకారంతో సమస్యను పరిష్కారం చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు శ్రీనివాస్, బాలుచారి, విక్రమ్, జీవన్ రెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అమెరికా ఇజ్రాయిల్ దేశాల దాడిని ఖండించండి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : ఇరాన్ దేశంలో అనుబాంబులు తయారు చేస్తున్నారని పేరుతో అమెరికా, ఇస్రాయిల్ దేశాలు దాడి చేసి దేశ అధ్యక్షుడిని, రక్షణ మంత్రి, సైనిక అధికారులను చంపటాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పోలీసులా వ్యవహరిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం స్వతంత్ర దేశాలపై, దేశాల అధ్యక్షులపై దాడి చేయటం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్ధం. ఐక్య రాజ్యసమితి అంతర్జాతీయ న్యాయస్థానం జోక్యం చేసుకొని అమెరికా, ఇజ్రాయిల్ ల దాడిని నిరోధించాలి. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలలో అంతర్గత ఆర్థిక రాజకీయ సంక్షోభాల నుండి బయటపడటానికి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న ఈ దాడి అంతర్జాతీయ టెర్రరిజం తప్ప మరొకటి కాదు. ప్రత్యక్షంగా ఇరాన్ దేశం ధ్వంసం అవుతుంది. పరోక్షంగా ప్రపంచంలోని అన్ని దేశాలు, ప్రజలు ఆర్థిక రాజకీయ భారాలు అనుభవించాల్సిన దుస్థితి నెలకొంటుంది. ప్రపంచ ప్రజలు కోరుతున్నట్టుగా సమస్యలుంటే చర్చించుకుని పరిష్కరించుకోవాలి తప్ప దాడులు, యుద్ధం పరిష్కారం కాదు. అమెరికా ఇజ్రాయిల్ దేశాలతో అంటగగుతున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ దాడిని ఖండించాలి. గత 80 సంవత్సరాల నుండి ఏ కూటమిలో చేరకుండా అలీన దేశాల కూటమికి నాయకత్వం వహించిన భారత్ ఇప్పుడు ఆ బాధ్యత మరిచి అమెరికా దాడిని ఖండించకుండా ఇరాన్ దేశంపై సానుభూతి వ్యక్తం చేయకుండా దొంగ నిద్రను నటించడం సిగ్గుచేటు. భారత ప్రభుత్వం అమెరికా యుద్ధోన్మాదాన్ని నిర్ద్వందంగా ఖండించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్ చేస్తూంది.

## మాదిగ అమరవీరులకు ఘన నివాళులు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా అమలవుతున్న ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించాలని, వర్గీకరణకు పార్లమెంట్ లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధత విషయంలో అనాటి నుంచి ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలపై ఉన్న కేసులను కేసులు వెంటనే కొట్టివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేడి యాదయ్య, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకుడు ఊదరి వెంకటేష్ మహాజన్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు బోయ మల్లేష్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు సుక్క అర్జున్ మాదిగ, సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి, నాయకులు ఆరుట్ల లింగస్వామి, చీమకండ్ల శ్రీనివాస్, దొనకొండ కిరణ్ కుమార్, రాజ్ పెరియార్, గడ్డం ప్రభాకర్, బద్రి గాలయ్య, బోయ సృజన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి, పౌరుషానికి ప్రతీక

* మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి, పౌరుషానికి ప్రతీక అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ మండలం రాములబండ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి వీర శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత కలసికట్టుగా గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. శివాజీ విగ్రహ ఏర్పాటు స్థలదాత పల్లె సుగుణమ్మ, విగ్రహ దాత వంగాల కిరణ్ కుమార్ గౌడ్, ఛత్రపతి శివాజీ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్, బొబ్బలి ప్రకాష్ రెడ్డి, ఛత్రపతి శివాజీ కమిటీ చైర్మన్ గూడూరి ఉమారెడ్డి, వైస్ చైర్మన్ బొంత వెంకన్న, కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి, కోశాధికారి బొబ్బలి నరసింహారెడ్డి, వరికుప్పల రాజు, కృష్ణంరాజు, మహేష్, బొబ్బలి వెంకట్ రెడ్డి, పల్లె కృష్ణారెడ్డి, బొబ్బలి గణేష్ రెడ్డి, చామకూరి రామయ్య, మాజీ ఎంపిటిసి చిలక రాజు బిక్షం, బొబ్బలి గణేష్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులుపాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీని వెంటనే నెరవేర్చాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ఎస్వీఆర్ కన్వెన్షన్ లో ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేడబోయిన మమత ఆవిష్కరించారు. అనంతరం తాళ్ళ నాగరాజు మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని 11సంవత్సరాలు గాడుస్తున్న హామీగానే మిగిలిపోయిందని, ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం




చేశారు. ప్రభుత్వ విద్యను ప్రభుత్వమే బలోపేతం చేయాలని, అందుకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని దుయ్యబట్టారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.మమత మాట్లాడుతూ విద్యార్థి నాయకుల బహిష్కరణ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని వి.సి. ని వైఖరిని ప్రశ్నించినందుకు వారిని క్యాంపస్ నుంచి బహిష్కరణ చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. తక్షణమే వారిపై బహిష్కరణ ఎత్తివేయాలని, లేనిచో దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్ తీగుళ్ళ శ్రీనివాస్ ధరావత్ జగన్, సహాయ కార్యదర్శి పుట్టల ఉదయ్, ఇందు రాణి, గాయత్రి, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, శ్రవణ్ రెడ్డి, నరేందర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, యుటిఎఫ్ జిల్లా నాయకులు యాదయ్య, సైదులు, అరుణ, బంగారు నరసింహ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నంద, లక్ష్మీపతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధు కృష్ణ, పల్లె శివ, గుండు నరసింహ, నరేష్, వెంకటేష్, వరుణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాడి నిరసన


* అమరవీరుల స్థూపం వద్ద న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ, అమెరికా తన మిత్రదేశమైన ఇజ్రాయిల్‌తో కలిసి పశ్చిమాసియా దేశాలపై దాడులను తీవ్రతరం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే అన్ని దేశాలు ఈ చర్యలను ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్య, ఏరియా కార్యదర్శి ఎన్. సంజీవ్, అధ్యక్షుడు మల్లికార్జునరావు, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు శరత్ మోహన్‌రావు, యాసరపు వెంకన్న, వై. శ్రీను, నరసింహారావు, సామెల్ సంజీవరావు, కాపు కృష్ణ, అవినాష్, రాధా కరుణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రతను బలోపేతం చేయడానికి సీసీ కెమెరాలు

: లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు, సిబ్బంది భద్రత బలోపేతం చేయడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని యువజన కాంగ్రెస్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కళ్లెం దయాకర్ రెడ్డిలు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వారు సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించడానికి సిసి కెమెరాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు, బోధించే ఉపాధ్యాయ బృందం భద్రతను మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు మాధవ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండమీది వెంకటేష్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## అమ్మ జన్మనిస్తుంది.. హెల్మెట్ పునర్జన్మనిస్తుంది

* భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అమ్మ జన్మనిస్తే.... మనం ధరించే హెల్మెట్ రోడ్డు ప్రమాద సమయంలో పునర్జన్మనిస్తుందని భద్రాచలం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. ఆదివారం పాల్వంచలో లయన్స్ క్లబ్ వారి రీజనల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంవీఐ వెంకటపుల్లయ్య హెల్మెట్ ధరించి మాట్లాడుతూ హెల్మెట్ నన్ను ధరించు.. నిన్ను రక్షిస్తానని' చెప్తుందన్నారు. నాణ్యత కలిగిన హెల్మెట్ పెట్టుకుని ద్విచక్రవాహనంపై వెళ్తే ప్రమాద సమయంలో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చు. కొద్ది దూరమైనా హెల్మెట్ పెట్టుకోవడాన్ని అలవాటు చేసుకోండి. బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు హెల్మెట్ పాధాన్యత వివరించి హెల్మెట్ పెట్టుకునేలా చేసి వారి యొక్క విలువైన ప్రాణాలను కాపాడుకునే విధంగా చూడాలని సూచించారు. అదేవిధంగా ప్రపంచ పర్యావరణ రక్షణ కొరకు మొక్కలు నాటుదాం.. పెంచుదాం అని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ స్థానంలో ఝూట్ బ్యాగులను వాడాలని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

## మొగుదాల స్వామి గౌడ్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్ తండ్రి చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మామ దశదినకర్మ వలిగొండ రోడ్డులోని ఎస్ ఎం రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. మొగుదాల స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 41వ డివిజన్ కార్పొరేటర్ కు ఘన సన్మానం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ కార్పొరేషన్ 41వ డివిజన్ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించిన కేసాని వేణుగోపాల్ రెడ్డి కి విద్యానగర్ వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి పూల బొకే అందజేశారు. గతం లో మున్సిపల్ కౌన్సిలర్ గా వేణుగోపాల్ రెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడం తో పాటు, నిత్యం ప్రజల మధ్య అందుబాటులో ఉంటారని అపార్ట్మెంట్ వాసులు కొనియాడారు. ఎవరికి ఏ ఆపద వచ్చిన వెంటనే స్పందించేతత్వం వేణుగోపాల్ రెడ్డి సొంతం అని.. అందుకే నూతనంగా ఏర్పడిన నల్లగొండ కార్పొరేషన్ లోనూ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించారని గుర్తు చేశారు. అందరికీ ఆత్మీయుడుగా గుర్తింపు పొందిన వేణుగోపాల్ రెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని పదవులు అధిష్టించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు మేరెడ్డి జనార్ధన్ రెడ్డి, తుమ్మల లింగస్వామి, యరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, లోట్లపల్లి కోటయ్య, దాయం భూపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, వాసుదేవుల ప్రఖ్యాత్, రమేష్, చంద్రశేఖర్ రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మార్చి 02వ తేదీ, సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## రోడ్ల మీద సోడా అమ్ముకునే కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి;మహబూబాబాద్ జిల్లా సోడా యూనియన్ సమావేశం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వర్రిపెల్లి శ్రీను అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి సి ఐ టీ యు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న మాట్లాడుతూ సోడా కార్మికలకు అడ్డలు ఏర్పాటు చేయాలనీ,లేబర్ కార్డ్స్ ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటన వారికి నెలకు 6000వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని,ఇండ్లు లేని నిరుపేద కార్మికులకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సోడా కార్మికులను పోలీసులు ఇబ్బంది పెట్టకుండా చూడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, అఫ్జల్, ఐలయ్య, వెంకటాద్రి, వేలాద్రి, ఉపేంద్ర, రాము,రాజు, వెంకన్న, మోహన్, రాములు, రాజు, వెంకటేష్, బాలు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## కాగితోజు స్వర్ణలత కు నివాళులు అర్పించిన చిలువేరు సమ్మయ్య గౌడ్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం మున్సిపాలిటీకి చెందిన కాగితోజు స్వర్ణలత శనివారం గుండెపోటుతో మరణించారు. కాగితోజు స్వర్ణలత మృతి పట్ల చిలువేరు సమ్మయ్య గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గోపా డివిజన్ అధ్యక్షుడు, కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆదివారం మృతిరాలి ఇంటికి వెళ్లి వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆమె మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు.

## విద్య కమిషన్ సిఫారసులు సవరించాలి....



ప్రజాస్ఫూర్తి జన్నారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక విద్య కమిషన్ సిఫారసులను సవరించాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షులు జాదవ్ వెంకట్రావు ఆదివారం రోజున మండల కేంద్రంలో జరిగిన పత్రికా సమావేశంలో విద్యా కమిషన్ను డిమాండ్ చేశారు. విద్యా కమిషన్ సిఫారసులు ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా, ముఖ్యంగా జీతా బత్యాల గురించి ప్రస్తావించడం చాలా దారుణమైన విషయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు ఎందుకంటే 20 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి తన యొక్క చివరాకరి నెల జీతం ఒక లక్ష యాభై వేలు ఉండటంలో తప్పేంటి అని ఆయన కమిషన్ ను ప్రశ్నించారు.ప్రభుత్వం కమిషన్ ఉపాధ్యాయ ఉద్యోగుల వేతనాలనే చూస్తుంది కానీ వారు అంకితభావంతో ప్రభుత్వ పథకాలను ప్రభుత్వం యొక్క అభివృద్ధిలో భాగమనే విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యాశాఖలోని ఉపాధ్యాయులు ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా వేతన జీవులుగానే రిటైర్డ్ అయ్యే వరకు ఉంటున్నారని రిటైర్డ్ అయిన తర్వాత కుటుంబ బాధ్యతలు వారి యొక్క 30 సంవత్సరాల ఆస్తి చూసుకుంటే ఎంతుంటుందో ఒకసారి ఆలోచించాలని, ఈ విధంగా ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీసే విధంగా సిఫార్సులు చేయడం సరికాదని వేరే డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు ఇప్పుడిప్పుడే ఉద్యోగస్తుల యొక్క వేతనాలు పెరుగుతున్నాయి గత 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఉద్యోగంలో చేరినప్పుడు వారి యొక్క వేతనాలు ఏ విధంగా ఉండే పెరిగిన ధరల కానుగుణంగా ఒక ఉద్యోగి రిటైర్డ్ అయ్యే నాటికి వారి కుటుంబ పోషణ వారి యొక్క పిల్లల చదువులకయ్యే ఖర్చు ఈ రోజులలో లక్షలలో ఉంటుందన్నారు.

## ఖమ్మంలో దౌర్జన్యంగా పేదల ఇళ్లు కూల్చేశారు

**: రామచందర్‌రావు**



ఖమ్మం: నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా పేదల ఇళ్లను కూల్చివేశారని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఖమ్మం శివారు వెలుగుమట్లలోని భూదాన్ భూములను ఆయన పరిశీలించారు. భూ నిర్వాసితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో రామచందర్‌రావు మాట్లాడారు. ''భూదాన్ బోర్డు పట్టాలున్న పేదల ఇళ్లను కూల్చివేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. పేదల వ్యతిరేక ప్రభుత్వం. పేదల ఇళ్లు కూలగొట్టి ఏం సాధించారు?బాధితుల పక్షాన భాజపా పోరాడుతుంది. కూల్చిన చోట పేదలకు 100 గజాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే పేదలను పంపించేస్తున్నారు'' అని ఆయన ఆరోపించారు.

## విహార యాత్రలతో మనసు ప్రశాంతత, ఆరోగ్యంతో పాటు సత్సంబంధాలు ఏర్పడతాయి

* **ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘీ**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : విహార యాత్రలతో మనసు ప్రశాంతత, ఆరోగ్యంతో పాటు సత్సంబంధాలు ఏర్పడతాయని, అవకాశం వచ్చినపుడల్లా విహార యాత్రకు వెళ్ళాలని భారతీయ యోగ సంస్థాన్ హైదరాబాద్ ప్రతినిధి, ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘీ అన్నారు. చింతల్ యోగా యూనిట్ ఆధ్వర్యంలో 42 మంది యోగా సాధకులు, వారి కుటుంబ సభ్యులతో భద్రాచలం, పాపికొండల ప్రాంతానికి శనివారం రెండు రోజుల విహార యాత్రకు బస్ లో బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో స్నానం ఆచరించి, భద్రచలం శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానాన్ని దర్శించి, అనంతరం పాపికొండల సుందర దృశ్యాలను ఆస్వాదించారు.ఈ సందర్భంగా శ్రీ సాయి కాలనీ ఆలయాల , అన్నప్రసాద ట్రస్ట్ చైర్మెన్ కన్నెకంటి లక్ష్మణ్ , శైలజలు మాట్లాడుతూ సాధకులు యోగా సెషన్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని, స్థానిక ఆహారంతో మరపురాని అనుభూతిని పొందారని తెలిపారు. ముఖ్యంగా పాపికొండలకు బోట్ ప్రయాణం, డ్యాన్స్ కార్యక్రమాలు ఏంతో అలరించాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 నుండి 6.30 వరకు గంట పాటు శ్రీ సాయి కాలనీలోని యోగా హాల్ లో భారతీయ యోగ్ సంస్థాన్, చింతల్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచితంగా యోగా నేర్పిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్, మే మాసాలలో స్కూల్ విద్యార్థులకు ఉచిత యోగా సమ్మర్ క్యాంప్ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని చింతల్ పరిసర ప్రాంత నివాసులు, విద్యార్థులు సద్వినియోగపరుచుకొని ఆరోగ్యంగా ఉండాలని చింతల్ యోగా యూనిట్ ఇంచార్జ్ మందపాటి ఉమాపార్వతి కోరారు. ఈ విహార యాత్రలో... గిర్మాజి అనురాధ, నరేంద్ర, సంజు లహరి, రోహిత్, లక్కోజు సత్యనారాయణ, బత్తోజు బ్రహ్మానందం, కన్నెకంటి సంధ్య, అనిత, కర్రా వాణి రెడ్డి, తన్న సత్యవతి, చెన్నుపాటి సుమతి, సలాడి సత్య, రేఖాదేవి శర్మ, కళ్యాణ్ రావ్ పాటిల్, ధర్మరాజ్ పాటిల్, టివి చారి, చొక్కారపు సంతోష్, హరీష్, కాసిన సురేష్, బొమ్మారెడ్డి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

* **రూ.10.70 కోట్లతో నిర్మాణం – ఏజెన్సీ ప్రజలకు నాణ్యమైన వైద్యం లక్ష్యం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: (చర్ల) ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో రూ.10.70 కోట్లతో నిర్మించనున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. టీజీఎంఎస్ఐడీసీ నిధులతో ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. శంకుస్థాపన అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని అభినందించిన మంత్రి, నిరుపేదలకు ప్రైవేటుకు దీటుగా సేవలు అందించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మారుమూల గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు స్థానికంగానే లభిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో డీసీహెచ్ఓ రవి బాబు, సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలి: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి




పటాన్ చెరు, ప్రజాస్ఫూర్తి :ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మల్లికార్జున హిల్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.ఎం. ఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో వ్యక్తుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలు పెంపొందించడంలో ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో శారీరక శ్రమ లేకపోవడం మూలంగా అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రతి రోజు గంటసేపు వ్యాయామానికి సమయం కేటాయించి ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలని కోరారు. ప్రతి సంవత్సరం మల్లికార్జున హిల్స్ ప్రీమియర్ లీగ్ పేరుతో క్రీడా పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులు నందారం రమేష్ గౌడ్ ను ఆయన అభినందించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రసిద్ధ శక్తి పీఠాల క్షేత్రాల నుంచి పవిత్రమైన మట్టిని తీసుకురావాలి

* **ఆలయ కమిటీ సమావేశంలో నిర్ణయం**




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : నిధుల కొరత వల్ల గత 45 రోజులుగా నిలిచిపోయిన పనులను తిరిగి పౌర్ణమి తర్వాత ప్రారంభించాలని ఆదివారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. విరాళాల కోసం దాతలను, భక్తులను ప్రత్యేకంగా సంప్రదించి విరాళాలు ఇచ్చే విధంగా విజ్ఞప్తులు చేయాలని నిర్ణయించారు. ఆలయ మండపంలో ఏర్పాటు చేయనున్న అష్టాదశ శక్తి పీఠాలకు సంబంధించిన అమ్మవారి విగ్రహాల ఏర్పాటు కోసం ప్రసిద్ధ శక్తి పీఠాల క్షేత్రాల నుంచి పవిత్రమైన మట్టిని తీసుకువచ్చే ఇక్కడ ఏర్పాటు చేయనున్న అమ్మవారి విగ్రహాలలో మిళితం చేయాలని వేద పండితుల సూచనల మేరకు కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా శ్రీలంక దేశంలో ఉన్న మొదటి శక్తిపీఠం శ్రీ శాంకరీ దేవి అమ్మవారి క్షేత్రం నుంచి పవిత్రమైన మట్టిని తీసుకొచ్చేందుకు ఆలయ దాత జనగామ రాజు ముందుకు వచ్చారు. ఆలయ వేద పండితుడు సంజీవ్ దేశ్ పాండే తో కలిసి శ్రీలంక కు బయలు దేరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎవరైనా భక్తులు కానీ దాతలు కానీ ప్రసిద్ధ శక్తి పీఠాల క్షేత్రాల దర్శనం కోసం వెళ్లి ఉంటే అక్కడి నుండి పవిత్రమైన మట్టిని తీసుకొని వచ్చి ఇక్కడి ఆలయ వేద పండితులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి తమ శక్తి కొలది విరాళాలు అందించి ఆలయం అభివృద్ధిలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో రాష్ట్రంలో మొదటి బహుమతి సాధించిన కిష్టాపూర్ విద్యార్థి



ప్రజాస్ఫూర్తి జన్నారం : ఇటీవల నిర్వహించిన ఫిజికల్ సైన్స్ రాష్ట్రస్థాయి టాలెంట్ పరీక్షలో మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి ఏ.అనన్య మొదటి ర్యాంకు సాధించి పాఠశాలకు మరొకసారి రాష్ట్రస్థాయిలో చక్కటి గుర్తింపు తెచ్చిందని విద్యార్థి ఎ. అనన్య ను మరియు గైడ్ టీచర్ కొట్టే రాజన్న ను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ శుక్రవారం రోజున హైదరాబాదు నందు విద్యార్థికి మరియు గైడ్ టీచర్ కు మెమొంటో తో పాటు సర్టిఫికెట్ మరియు నగదు బహుమతి గా రూII మూడు వేలను అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. శనివారం రోజున పాఠశాలలో జరిగిన జాతీయస్థాయి సైన్స్ దినోత్సవం నందు జన్నారం ఫారెస్ట్ డివిజన్ అధికారి రామ్ మోహన్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న ఉపాధ్యాయ బృందంతో కలిసి విద్యార్థితో పాటు విద్యార్థి యొక్క తల్లిదండ్రులను పాఠశాలలో సన్మానించారు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య , గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి మంగ మరియు పాఠశాల ఉపాధ్యాయులు జాడి మురళి దాముక కమలాకర్, ఎ.గోవర్ధన చారి, ఆర్. బుచ్చి లింగయ్య ప్రకాష్,నగేష్, మణెమ్మ,జ్యోతిశీల, అశోక్, నరహరి శర్మ, కాంతయ్య, శ్రీనివాస్, వాసు, రజిత రాణి, సుస్మిత, అజీమ్. స్వప్న మరియు గ్రామస్తులు అభినందించారు.

## గల్ఫ్ లో ఉన్న తెలుగు వారందరూ జాగ్రత్తగా ఉండాలి..



ప్రజాస్ఫూర్తి జన్నారం : గల్ఫ్ లో జరుగుతున్నటువంటి ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ లో ఉన్న మన తెలుగు వారందరూ జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య పాత్రికేయుల సమావేశ వేదికగా తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఉన్నటువంటి గల్ఫ్ కార్మికులందరికీ అక్కడున్నటువంటి వారందరూ పలు జాగ్రత్తలు పాటించాలని గల్ఫ్ లో ఉన్నటువంటి రూల్స్ కు అనుకూలంగా మెదులుకోవాలని,గల్ఫ్ దేశాల్లో ఉన్నటువంటి కొన్ని కఠినమైన రూల్స్ ఉంటాయి అని అక్కడ జరుగుతున్నటువంటి విషయాలను వీడియోలు గాని ఇతరత్రా దేశానికి సంబంధించిన విషయాలు ఏదున్న సోషల్ మీడియా వేదికగా పంపించినప్పుడు కొన్నిసార్లు అక్కడ దేశాలు వాటిని పరిగణలోకి తీసుకొని కఠిన చర్యలు తీసుకుంటయి అని తెలిపారు. కావున వాటిని దృష్టిలో పెట్టుకొని, అక్కడ ఒకవేళ యుద్ధ వాతావరణం ఉన్నట్లయితే మన దేశ ప్రభుత్వం ప్రకటించినటువంటి హెల్ప్ లైన్ సెంటర్ నెంబర్లకు కాల్ చేసి అక్కడి పరిస్థితులను వివరిస్తూ మన తెలుగు వాళ్ళందరూ జాగ్రత్తగా ఉండాలని వారు తెలిపారు. గల్ఫ్ లో ఉంటున్న వారి కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఫోన్లో సంప్రదింపులు జరుపుతూ అక్కడ ఉన్నటువంటి వారి పరిస్థితులను తెలుపుతూ వారి కుటుంబ సభ్యులు ఎటువంటి అయోమయం లో పడకుండా ఆందోళన వ్యక్తం చెందకుండా ఎప్పటికప్పుడు వారితో మాట్లాడుతూ పరిస్థితులకు అనుకూలంగా మెదులుకోవాలని వారు కోరారు అత్యవసర పరిస్థితులలో ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా జన్నారం మండల తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అండగా ఉంటుందని ఈ వేదికగా మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మండల కమిటీ గల్ఫ్ కార్మికులకు భరోసా గా ధైర్యం.

## వైష్ణవి ఒలంపియాడ్ పాఠశాలలో ఘనంగా వైజ్ఞానిక ప్రదర్శన








కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడుతాయని వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా షాపూర్ నగర్ లోని వైష్ణవి ఒలంపియాడ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు టీయూడబ్ల్యుజే ఐజేయూ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు గౌడ్, వైష్ణవి గ్రూప్ ఆఫ్ అకాడమిక్ డైరెక్టర్ సాయిబాబాలు హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన నమూనాలను తిలకించి అభినందించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ నమూనాలు, సృజనాత్మక ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చేసిన వివరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్ర,సాంకేతిక దృక్పథాన్ని అలవర్చుకొని భావితరాలని నిపుణులు కావాలని అన్నారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణికి రెండేళ్లు.. 47 వేల దరఖాస్తులు పరిష్కారం

ముఖ్యమంత్రి ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోంది. సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతుండడంతో రాష్ట్రం నలువైపుల నుంచి ప్రజలు భారీ ఎత్తున రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణికి తరలివస్తున్నారు. రెండేళ్ల క్రితంప్రారంభమైన సీఎం ప్రజావాణి ప్రతి వారంలో మంగళ, శుక్రవారాలలో జరిగే ఈ కార్యక్రమం ఇప్పటివరకు 24 సెషన్స్ పూర్తి చేసుకుంది. రెండేళ్ల కాలంలో సీఎం ప్రజావాణిలో మొత్తం ఒక లక్షా 12 వేల 245 దరఖాస్తులు నమోదు కాగా అందులో 64,558 దరఖాస్తులు పరిగణలోకి తీసుకొని 47,935 దరఖాస్తులు పరిష్కరించారు. మిగతా 47,687 దరఖాస్తులు ప్రభుత్వ పథకాలు, విధానపరమైన ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవాల్సినవి కావడం, ఉద్యోగాల కోసం సంబంధించినవి ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని కోరుతూ సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు. సీఎం ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల పరిష్కారం 74 శాతం మేరకు ఉండడంతో ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. సీఎం ప్రజావాణి పై ప్రజల్లో భరోసా పెరిగింది. దీంతో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాలలో సుమారు వేయి దరఖాస్తులు నమోదు అవుతున్నాయి.

**చిన్నారెడ్డి బాధ్యతలు చేపట్టి రెండేళ్లు..**

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి సీఎం ప్రజావాణి ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా ఆదివారానికి రెండేళ్లు పూర్తి అవుతోంది. సీఎం ప్రజావాణికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులు స్వయంగా స్వీకరించి ఓపికతో సమస్యలు విని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి దరఖాస్తుపై ఎండార్స్‌మెంట్ చేసి చిన్నారెడ్డి స్వయంగా స్టాంప్ వేస్తుండడం విశేషం. ఈ ప్రక్రియ ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోంది. నిరంతరం వారంలో రెండు రోజులు ఇదే తరహా ప్రక్రియతో పాటు ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా సంబంధిత శాఖకు సిఫార్సు చేస్తుండడం వల్ల సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతున్నాయి.

*** ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు**

గల్ఫ్‌లోని ఏడు దేశాలు సహా ఇతర దేశాలలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీఎం ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని కూడా ఈ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సీఎం ప్రజావాణిలో దరఖాస్తులు రాసి ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్, ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు, వైద్య సహాయం కోసం మెడికల్ క్యాంపు, వృద్ధులు దివ్యాంగుల రవాణా కోసం బ్యాటరీ బగ్గి, వీల్ చైర్స్, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, ప్రజలకు మంచినీటి సౌకర్యం, జీహెచ్‌ఎంసీ ఆర్థిక సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ఐదు రూపాయల భోజనం వంటివి సీఎం ప్రజావాణిలో కల్పించారు.




*** ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర**

సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ కూడా ఎంతో ఓపికతో ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు పరిష్కరించడం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ గ్రూపుల పరీక్షలు, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ రిక్రూట్‌మెంట్‌లలో జాప్యం, ఫలితాల విడుదల వంటి అంశాలు, రైతుల వ్యవసాయ సంబంధిత సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రజల ఆరోగ్య సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలు, ఆర్టీసీ కార్మికులు, గల్ఫ్ కార్మికుల సమస్యలు వంటి అనేక అంశాలు సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి ద్వారా పరిష్కారమవుతున్నాయి. సీఎం ప్రజావాణి సక్సెస్ కార్యమాన్ని వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు, గ్రూప్ 1 అధికారులు పరిశీలించారు. సీఎం ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో డాక్టర్ చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందు వల్ల పరిష్కారం 74 శాతంగా ఉంది. రానున్న రోజుల్లో పరిష్కార శాతాన్ని మరింత మెరుగు పర్చేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.



## విందు లో... క్రికెట్ సందడి

కూకట్ పల్లి లోని ఓ కన్వెన్షన్ హల్ లో పెళ్లి విందులో నూతన దంపతులు ఆదివారం T20 వరల్డ్ కప్ మ్యాచ్ ను తిలకిస్తూ సందడి చేశారు. T20 వరల్డ్ కప్ మ్యాచ్ ఇండియా, వెస్ట్ ఇండీస్ మధ్య డూ ఆర్ డై ఉండటంతో పెళ్లి వేడుకలో స్క్రీన్ ఏర్పాటు చేశారు. నూతన వధూవరులు పుట్ట ఉత్తమ్ కుమార్, నాగ ఆశ్విని తో పాటు అతిథులు తిలకించారు.

**- ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్**

## పాతబస్తీలో ముస్లింల ర్యాలీ..
# హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ వద్ద భారీ భద్రత

అమెరికా ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యను ఖండిస్తూ హైదరాబాద్ పాత బస్తీలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. తంజీమ్ ఏ జాఫెరి ఆధ్వర్యంలో మజార్ ఏ ఇబ్నే ఖటూన్ నుంచి దారుల్‌షిఫా ప్లే గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. అమెరికా ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వందలాది మంది పాఠశాల విద్యార్థుల్ని పొట్టన పెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇరాన్ ప్రజానీకానికి మద్దతు ప్రకటించారు. ఇరాన్‌పై దాడిని రాష్ట్ర ప్రభుత్వం ఖండించాలని డిమాండ్ చేశారు. అనేక మంది స్థానిక మత నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు.



*** యూఎస్ కాన్సులేట్ వద్ద భారీ భద్రత**

పాతబస్తీలో భారీ ర్యాలీ నేపథ్యంలో నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద సైబరాబాద్ పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా.. కాన్సులేట్ పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోని తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుమారు 50 మంది పోలీసులతో కాన్సులేట్ వద్ద ప్రత్యేక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. కాన్సులేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని తాత్కాలికంగా మూసివేసి, బారికేడ్లను ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.



## ఓ సాహితీ సామ్రాజ్ఞి!

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
భాగ్యనగరం

కళ్ళముందుకు వస్తావు,
చూపులు పట్టేస్తావు,
దృశ్యాన్ని చూపుతావు,
అందాల బొమ్మను చేయిస్తావు.

తలలోకి దూరతావు,
ఆలోచనలు పారిస్తావు,
భావాన్ని పుట్టిస్తావు,
చక్కని రూపాన్ని ఇప్పిస్తావు.

తెల్ల కాగితాన్ని ఇస్తావు,
కలాన్ని చేత పట్టిస్తావు,
నల్లని అక్షరాల్ని గీయిస్తావు,
కమ్మని కవితను కూర్పిస్తావు.

మట్టి ప్రమిదను అందిస్తావు,
నూనెను నిండుగా నింపిస్తావు,
చిరు దివ్వెను వెలిగిస్తావు,
కాంతి కిరణాల్ని వెదజల్లిస్తావు.

అంధకారమై ఆవరిస్తావు,
జాబిలిని పొడిపిస్తావు,
వెన్నెలను కురిపిస్తావు,
మదులను మురిపింపజేస్తావు.

అసంపూర్ణ వాక్యానివై వస్తావు,
ప్రాసలు చేర్చమంటావు,
అలంకారాలు వాడమంటావు,
అద్భుత కవనాన్ని అల్లిస్తావు.

తేనెచుక్కలు చల్లుతావు,
పెదాలను తెరిపిస్తావు,
స్వరాలను పలికిస్తావు,
మోహన రాగాలు పాడిస్తావు.

హరివిల్లును పొడిపిస్తావు,
ఏడు రంగులను చూపిస్తావు,
కుంచెను చేతబట్టమంటావు,
విచిత్ర చిత్రాన్ని తయారుచేయిస్తావు.

నల్లరాయిని విసురుతావు,
ఉలిని పట్టుకోమంటావు,
బండను చెక్కమంటావు,
సుందర శిల్పాన్ని చేయిస్తావు.

సముద్రానివై వస్తావు,
నదిలా పారమంటావు,
జీవిత పయనం సాగించమంటావు,
నీలో చివరకు కలుపుకుంటావు.

నిశ్శబ్దాన్నె కూర్చుంటే,
నాలో మాటలు మేల్కొలుపుతావు,
నిరాశలోనూ దీపమవుతావు,
నా జీవిత నౌకకు
దారిచూపే దిక్సూచివవుతావు.

సాహితీ సామ్రాజ్ఞివై వస్తావు,
సృష్టికి సింహాసనం వేస్తావు,
నా శ్వాసలో శబ్దమవుతావు,
నన్నే నీ కవిగా మార్చుకుంటావు.



## వేట్లపాలెం బ్లాస్ట్ బాధిత కుటుంబాలకు
# మంత్రుల పరామర్శ : చెక్కుల అందజేత

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం జరిగిన భారీ పేలుడు ఘటనలో 21 మంది దుర్మరణం చెందారు. దీంతో వారి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. మంత్రులు కందుల దుర్గేష్, నారాయణ, వాసంశెట్టి సుభాష్ హోంమంత్రి అనిత, అధికారులు ఆదివారం ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షలు (ఒక్కో కుటుంబానికి) చెక్కుల్ని అందజేశారు. అలాగే చనిపోయినవారు ఎప్పటి నుంచి ఆ బాణసంచా కేంద్రంలో పనులకు వెళ్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్నివిధాలా బాధితులను ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కూలిపనులు చేసుకుంటేకాని ఇల్లుగడవని పరిస్థితులని, పొట్టకూటికోసం పనులకు వెళ్తే ప్రాణాలమీదికి వచ్చిందని మంత్రుల ఎదుట బాధితులు వాపోయారు. కాగా.. రాయవరం ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఇటీవల జరిగిన రాయవరం ఘటనతోనే పర్మిషన్లు, NOCలను మరింత కఠినతరం చేశామని, అధికారులను మూడునెలలకు ఒకసారి బాణసంచా తయారీకేంద్రాల్లో ఇన్‌స్పెక్షన్ చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. కానీ బాణసంచా తయారీకేంద్రాలు పరిమితికి మించి కార్మికులను పనుల్లోకి తెచ్చుకుంటున్నారని, దీనివల్లే ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోందన్నారు. ఇకపై ఇలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


## రాజకీయ విమర్శలు మానుకొని..
# అభివృద్ధిపై దృష్టి పెట్టండి: బండి సంజయ్



సిద్దిపేట: కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా మెజార్టీ సీట్లు గెలిచినా, మేయర్ పదవి రాకుండా అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పటికైనా రాజకీయ విమర్శలు మానుకొని, కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం విజయనగర్ కాలనీలో ఆదివారం బండి సంజయ్ పర్యటించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇటీవల ఏకగ్రీవమైన విజయనగర్ కాలనీ భాజపా గ్రామ సర్పంచ్ సాదుల అమూల్యకు రూ.10 లక్షల నిధులు అందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భాజపా బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవ సర్పంచ్‌లుగా గెలిపిస్తే.. ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు ఇస్తానని చెప్పినట్లు గుర్తు చేశారు. ఎంపీ నిధుల కింద తనకు వచ్చే రూ.5 కోట్లతో తన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 5 జిల్లాల్లో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. తన నియోజకవర్గ పరిధిలోని 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు ఇచ్చానని, తన జీతం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 15 వేల మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించానని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్‌లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని బండి సంజయ్ అన్నారు.

# కులాంతర వివాహాలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు, కులాంతర పెళ్లిల్లు చేసుకున్న దళితులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు, వారికి ఆర్థిక భరోసా కూడా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇంటర్ క్యాస్ట్ ఇన్సెంటివ్ స్కీమ్ పథకాన్ని అమలు చేస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ఈ పథకం కింద 2 లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తుంది. అయితే జంటల్లో వధువు లేదా వరుడు ఇద్దరిలో ఎవరో ఒకరు ఎస్సీ అయి ఉండటంతో పాటు ఆ వివాహం చట్టబద్ధంగా రిజిస్టర్ అయి ఉండాలనే నిబంధన ఉన్నది. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఈ ఆర్థిక సంవత్సరం వరకూ ఈ పన్నెండు ఏళ్లలో 13,419 కులాంతర వివాహాలు కాగా, వారికి దాదాపుగా రూ.238.17 కోట్ల రూపాయలు ఆర్థిక సాయం అందినట్లుగా అధికారులు వివరాలు




అందించారు. ప్రతి ఏడాది వారీగా పరిశీలిస్తే 2014-15 ఏడాదిలో 459 వివాహాలు కాగా రూ.2.10కోట్ల ఆర్థిక సాయం అందించారు. 2015-16 ఏడాదిలో 800 పెళ్లిల్లు కాగా, రూ.3.81కోట్ల ఆర్థిక సాయం, 2016-17లో 1009 పెళ్లిల్లు కాగా, రూ.4.89కోట్లు, 2017-18లో 646 పెళ్లిల్లు కాగా, రూ.3.21కోట్లు, 2018-19లో 734 వివాహాలకు, రూ. 3.64కోట్లు, 2019-20లో 918 వివాహాలకు, రూ. 4.63కోట్లు, 2020-2021లో 760 వివాహాలకు, రూ. 13.92కోట్లు, 2021-22 563 వివాహాలకు, రూ. 13.72కోట్లు, 2022-23లో 418 వివాహాలకు రూ.10.45 కోట్లు, 2023-24 వివాహాలకు, రూ. 6.07కోట్లు, 2024-25 383 వివాహాలకు, 9.58కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరం 202526లో ఇప్పటి వరకూ 1259 వివాహాలకు ఇప్పటి వరకూ రూ. 31.48 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మొత్తం ఈ పన్నెండు ఏళ్లలో 13,419 వివాహాలకు 238.17 కోట్ల ఆర్థిక సాయాన్ని వారికి అందిజేసినట్లుగా అధికారులు చెప్పారు. గత పన్నెండు ఏళ్లలో పోలిస్తే ఈ ఏడాదిలోనే ఎక్కువ వివాహాలు, ఎక్కువ ఆర్థికసాయాన్ని అందజేశారు.

## నిరాధార ఆరోపణలు
# కాకాణికి పరిపాటే: సోమిరెడ్డి

నెల్లూరు: మాజీ మంత్రి కాకాణి తనపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాకాణి గోవర్ధన్‌రెడ్డిది కాకిగోల అని విమర్శించారు. నిద్రపట్టక పిచ్చి కూతలు కూస్తున్నారని ఎద్దేవా చేశారు. "కాకాణి మంత్రిగా సంపాదించిన అక్రమ సంపాదనను బయటపెట్టాను. బండేపల్లి భూముల విషయంలో తహసీల్దార్ల నుంచి ఆర్డీవో వరకు 'నుడా'కి అలర్ట్ చేస్తూ ఆదేశాలిచ్చారు. అనుచరులు దోపిడీ చేస్తుంటే వాళ్లకి కాకాణి మద్దతు తెలిపారు. మొదటి నుంచి నిరాధార ఆరోపణలు చేయడం ఆయనకు పరిపాటిగా మారింది" అని సోమిరెడ్డి విమర్శించారు.



# సమాచార లోపంతోనే శారదా పీఠం భూములపై గందరగోళం

మతాన్ని అడ్డు పెట్టుకొని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఆదివారం కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి.. అక్కడి రాజశ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరు కావాలనే బురద జల్లుతున్నారని విమర్శించారు. బాపూ ఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని.. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠం భూముల వ్యవహారంలో సమాచార లోపం వల్లే గందరగోళం తలెత్తిందని స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని.. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వానికి భేషజాలు లేవని.. తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.



*** రక్తదానం ప్రాణదానంతో సమానం**

ఆపదలో ఉన్న వారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నేటితరం యువత సామాజిక స్పృహతో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఎస్ఎస్ఎస్ యువ సేన ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. 400లకు పైగా విమానాలు రద్దు..!



దిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ సహా పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. ఈ నేథ్యంలో దేశవ్యాప్తంగా ఆదివారం 444 విదేశీ విమానాలను రద్దు చేసే అవకాశం ఉందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఎన్ని విమానాలు రద్దవ్వనున్నాయి, ఎన్ని ఆలస్యమవ్వనున్నాయనే విషయంపై విమానయాన సంస్థల అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఫిబ్రవరి 28న 410 దేశీయ విమానాలను రద్దు చేసినట్లు వెల్లడించింది. విమానాల రద్దు నేపథ్యంలో విమానాశ్రయాల్లోని టెర్మినల్స్ వద్ద ప్రయాణికులకు సహకారం అందించేందుకు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు పలువురు సీనియర్ అధికారులను నియమించినట్లు విమానయాన శాఖ తెలిపింది. ప్రయాణికుల ఫిర్యాదులను నమోదు చేయడానికి తాము ఏర్పాటు చేసిన డిజిటల్ ఫిర్యాదుల పరిష్కార వేదిక 'ఎయిర్‌సేవ'కు 216 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. వాటిలో 105 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ప్రయాణికుల భద్రత, కార్యాచరణ నిబంధనలను కచ్చితంగా పాటించేలా విమానయాన సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (DGCA) వెల్లడించింది. విమానాల మళ్లింపులు, రద్దు నేపథ్యంలో ప్రయాణికులకు తగిన సదుపాయాలు కల్పించాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు సూచించినట్లు తెలిపింది. మరో వైపు ఆదివారం సుదూర ప్రాంతాలకు వెళ్లే పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను రద్దు చేసినట్లు దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా ప్రకటించింది. వీటిలో లండన్, షికాగో, టొరంటో, న్యూయార్క్, పారిస్ వంటి నగరాలు ఉన్నట్లు తెలిపింది. దోహా నుంచి వెళ్లాల్సిన అన్ని విమానాలను రద్దు చేసినట్లు ఖతార్ ఎయిర్‌లైన్స్ ప్రకటన విడుదల చేసింది.

*** విదేశీయులకు హోం మంత్రిత్వ శాఖ అడ్వైజరీ**

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని విదేశీయులకు అడ్వైజరీ జారీ చేసింది. భారీగా విమానాలు రద్దవుతోన్న నేపథ్యంలో ప్రయాణాలకు అంతరాయం కలిగిన విదేశీయులు సమీపంలోని విదేశీయుల ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి సహాయం తీసుకోవాలని సూచించింది. భారత్‌లో తమ వీసాలను పొడిగించుకోవడానికి, క్రమబద్ధీకరించుకోవడానికి అవసరమైన సహాయాన్ని అధికారులు అందిస్తారని తెలిపింది.



## యూఏఈపై ఇరాన్ దాడులు.. ఓ భారతీయుడికి గాయాలు

అమెరికాఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా పలు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. ఈ క్రమంలో యూఏఈపై జరిపిన దాడుల్లో ముగ్గురు మృతి చెందారని, వీరు పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన వారని యూఏఈ రక్షణశాఖ వెల్లడించింది. 58 మంది గాయపడగా.. వారిలో ఓ భారతీయుడు కూడా ఉన్నట్లు తెలిపింది. ఈ విషయంపై అబుదాబీలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. భారత పౌరుడు గాయపడిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పేర్కొంది. ఇప్పటికే ఆసుపత్రి వర్గాలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నామని, బాధితుడికి అవసరమైన సాయం అందిస్తామని వెల్లడించింది. ఇప్పటివరకు 541 ఇరాన్ డ్రోన్లను గుర్తించామని, వీటిలో 501 డ్రోన్లను ధ్వంసం చేశామని యూఏఈ రక్షణశాఖ వెల్లడించింది. 35 డ్రోన్లు దేశం లోపలికి దూసుకొచ్చాయని, వీటివల్ల కొంత ఆస్తి నష్టం సంభవించినట్లు పేర్కొంది.

## కర్ణాటక గ్రామంలో 'ఖమేనీ' పర్యటించిన వేళ!

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన మద్దతుదారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భారత్‌లోనూ పలు ప్రాంతాల్లో ఆయన మద్దతుదారులు సంఘీభావంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కర్ణాటకలోని ఓ గ్రామం కూడా శోకసంద్రంలో మునిగిపోయింది. దాదాపు నలభై ఏళ్ల కిందట ఖమేనీ ఆ గ్రామంలో పర్యటించడమే ఇందుకు కారణం. చిక్కబళ్లాపుర జిల్లాలోని అలీపుర జనాభా దాదాపు 30 వేలు. వీరిలో ఎక్కువ మంది షియా ముస్లింలు. దీన్ని 'మినీ ఇరాన్'గా అభివర్ణిస్తుంటారు. 1986లో ఖమేనీ భారత్‌లో పర్యటించగా.. ఆ సందర్భంలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆయన అలీపురను సందర్శించారు. స్థానిక ప్రజలతోపాటు మత పెద్దలతో ముచ్చటించారు. ఆ తర్వాత ఆయన గౌరవార్థంగా స్థానికంగా ఓ ఆసుపత్రిని నిర్మించారు.




ఇలా ఇరాన్‌తో ఈ గ్రామానికి బలమైన సాంస్కృతిక సంబంధాలు ఏర్పడ్డాయని స్థానికులు పేర్కొన్నారు. అనేక కుటుంబాలు ఉన్నత చదువుల కోసం ఇరాన్ వెళ్లడంతోపాటు కొందరు అక్కడే ఉద్యోగాలు చేస్తూ స్థిరపడినట్లు తెలిపారు. తాజాగా అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో సుప్రీం లీడర్ ఖమేనీ మృతి చెందారనే వార్తతో అలీపురవాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సంఘీభావంగా గ్రామంలో మూడు రోజులపాటు సంతాప దినాలను ప్రకటించారు. దుకాణాలు, వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. అన్ని రకాల వేడుకలు, బహిరంగ సభలు నిర్వహించకూడదని ప్రకటించారు.

**కశ్మీర్‌లోనూ..**

భారత పర్యటన సందర్భంగా ఖమేనీ కశ్మీర్‌లోనూ పర్యటించారు. శ్రీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 15 నిమిషాల ప్రసంగం స్థానిక ముస్లిం వర్గాల్లో కీలక మార్పు తెచ్చిందని ఆ వర్గ ప్రజలు విశ్వసిస్తారు. ఖమేనీ భారత్‌లో పర్యటించేనాటికి ఇంకా ఇరాన్ పాలనా బాధ్యతలు స్వీకరించలేదు. అయితే, 2012లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ టెహ్రాన్ పర్యటన సందర్భంగా తన భారత పర్యటన గురించి సుప్రీం లీడర్ ఖమేనీ గుర్తు చేసుకున్నట్లు సమాచారం.

## కరాచీలో చిక్కుకున్న ఎనిమిది మంది భారతీయులు

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అనేక అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరికొన్ని సర్వీసులను దారి మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో ఎనిమిది మంది భారతీయులు పాకిస్థాన్‌లోని కరాచీ విమానాశ్రయంలో చిక్కుకున్నట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది. వీరిలో ముగ్గురు తమ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నట్లు తెలిపింది. మిగతావారి వివరాలు తెలియాల్సి ఉంది. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి కువైట్‌కు ఎయిర్ అరేబియా విమానం బయలుదేరింది. షార్జా మీదుగా వెళ్లే క్రమంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో ఈ విమానాన్ని దారి మళ్లించడంతో పాకిస్థాన్‌లోని కరాచీ విమానాశ్రయంలో దిగింది. ప్రయాణికుల్లో కేరళలోని పాలక్కడ్‌కు చెందిన కృష్ణదాస్ దంపతులు, వారి మూడేళ్ల కుమార్తె సహా ఎనిమిది మంది భారతీయులు ఉన్నట్లు కేరళ ప్రవాసి వ్యవహారాల విభాగం నోర్కా రూట్స్ వెల్లడించింది. విదేశాల్లో ఉన్న రాష్ట్ర వాసుల కోసం 'నోర్కా రూట్స్' పేరుతో కేరళ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశాల్లో ఉన్న




వారితో సంప్రదింపులు జరుపుతోంది. ఈ క్రమంలో పాక్‌లో చిక్కుకున్న వారితోనూ సంప్రదింపులు జరిపింది. ఈ విషయాన్ని భారత విదేశాంగశాఖ దృష్టికి తీసుకెళ్లింది. అయితే, వీరిని తొలుత కొలంబో, అక్కడి నుంచి భారత్‌కు తీసుకువచ్చే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.



## నాగ్‌పుర్‌లో భారీ పేలుడు.. 17 మంది మృతి

మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ (SBL) ఎనర్జీ లిమిటెడ్‌లో తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 17 మంది మృతిచెందగా.. 18 మంది తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు వెల్లడించారు. ఉదయం ఇందులోని ఒక యూనిట్‌లో అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని.. ఆ సమయంలో, 30 మందికి పైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారని తెలిపారు.

**సీఎం ఫడణవీస్ దిగ్భ్రాంతి**


ప్రమాదంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని పేర్కొన్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని..గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపడతామని తెలిపారు.

## భగ్గుమన్న చమురునాడి.. భారతీయులున్న ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..!

అంతర్జాతీయ చమురు రవాణాకు జీవనాడి వంటి హర్మూజ్ జలసంధి ఇరాన్ (Iran) సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో భగ్గుమంది. ఈ కీలక చమురు మార్గాన్ని మూసివేస్తున్నట్లు టెహ్రాన్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఓ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. పలావు దేశ పతాకంతో వస్తున్న స్కైలైట్ చమురు ట్యాంకర్‌పై ఆదివారం ఒమన్‌లోని ముసాండమ్ ద్వీపకల్పం వద్ద ఖసాబ్ పోర్టు వద్ద ఇరాన్ దాడి చేసింది. ఆ సమయంలో నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 15 మంది భారతీయులు.. మిగిలిన వారు ఇరాన్ జాతీయులు. ఈ దాడిలో నలుగురు గాయపడ్డారని ఒమన్ వెల్లడించింది.

**ఏమిటీ హర్మూజ్ జలసంధి..**

అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పంఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇరు దేశాలు ఇందులో అత్యధిక భాగం తమదే అని చెబుతున్నాయి. రెండు



షిప్పింగ్ లేన్లు ఉన్నాయి.ఇందులో క్రూడ్ క్యారియర్లు సులువుగా ప్రయాణించగలుగుతాయి. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

**భారత్‌పై తీవ్ర ప్రభావం**

మన దేశం దిగుమతి చేసుకొనే ఎల్ఎన్‌జీలో సగానికిపైగా ఈ మార్గం నుంచే రావాల్సి ఉంటుంది. హర్మూజ్ మీదుగానే రావాల్సి ఉంది. ఇక రోజువారీ 55లక్షల పీపాల చమురును భారత్ ఈ మార్గం నుంచి దిగుమతి చేసుకొంటోంది. ఇది భారత చమురు అవసరాల్లో 40%శాతానికి సమానం. గత రెండు నెలల్లో ఇది 50% శాతానికి చేరింది. హర్మూజ్‌లో ఇబ్బందులు ప్రపంచ చమురు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి.

**గతంలోనూ ట్యాంకర్లపై దాడులు**

1980-88 వరకు జరిగిన ఇరాన్ఇరాక్ యుద్ధం ప్రభావం జలసంధిపై పడింది. నాడు ఇరు దేశాలు పరస్పర ఎగుమతులను దెబ్బతీసేందుకు.. ట్యాంకర్లపై దాడులు చేసుకొన్నాయి. దీనిని ట్యాంకర్ వార్ అని కూడా అంటారు. ఆ సమయంలో వివిధ దేశాల పతాకాలపై ప్రయాణించిన దాదాపు 450కు పైగా నౌకలపై ఇరు దేశాలు దాడులు చేశాయి.

## దాడుల్లో 48 మంది ఇరాన్ నేతలు చనిపోయారు: ట్రంప్

ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతంగా కొనసాగుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఊహించిన దానికంటే వేగంగా ముందుకెళ్తున్నామన్నారు. ఈ దాడుల్లో 48 మంది ఇరాన్ నేతలు చనిపోయినట్లు తెలిపారు. వివిధ మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో ట్రంప్ మాట్లాడుతూ.. ఏది కరెక్టో అదే చేస్తున్నానని చెప్పారు. అమెరికాతో చర్చలు జరిపేందుకు ఇరాన్ నేతలు ముందుకు వచ్చారని, అందుకు తాను అంగీకరించానన్నారు. వాళ్లు ఈ పని ముందే చేయాల్సి ఉందని అభిప్రాయపడిన ఆయన.. చమురు ధరల పెరుగుదలపై



ఆందోళన వద్దని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ముగ్గురు అమెరికన్ సైనికులు మృతి**

ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా తమ సైన్యానికి చెందిన ముగ్గురు సిబ్బంది చనిపోయినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. మరో ఐదుగురికి తీవ్రంగా గాయాలైనట్లు వెల్లడించింది. మరోవైపు అమెరికా యుద్ధనౌక అబ్రహం లింకన్‌పై తాము దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. అయితే, దీనిని అమెరికా సైన్యం ఖండిస్తూ.. అటువంటి దాడి జరగలేదని పేర్కొంది. కనీసం వారి ఆయుధాలు తమ నౌక సమీపంలోకి కూడా రాలేదని తెలిపింది.

## ఖమేనీ భేటీపై పక్కా సమాచారం.. తొలి టార్గెట్ ఆయనే..!

ఇరాన్ అగ్రనేత ఖమేనీ కదలికలు.. షెడ్యూల్ పక్కాగా అమెరికా వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనే లక్ష్యంగా చేసుకొని అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీని మొదలుపెట్టింది. శనివారం ఖమేనీ తన కీలక సలహాదారులైన షాంఖానీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీతో భేటీ అయ్యారు. ఈ సమావేశ సమాచారమే దాడులు చేసేలా అమెరికాను పురి గొల్పింది. నిఘా సంస్థ సీఐఏ కొన్ని నెలలుగా ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సమన్వయంతో ఖమేనీ కదలికలపై నిఘా ఉంచింది. ఖమేనీ పాలన భవనాల్లో ఒక చోట ఈ భేటీ జరగనున్నట్లు గుర్తించారు. దీంతో అక్కడే దాడిచేయాలని అమెరికా, ఇజ్రాయెల్ భావించాయి. కాకపోతే ఆ భవన ప్రాంగణాల్లో ఎక్కడ ఖమేనీ ఉన్నారో ఆ దేశాల వద్ద కచ్చితమైన సమాచారం లేదు. ఖమేనీ భేటీ కూడా శనివారం సాయంత్రం జరగాల్సి ఉన్నట్లు సమాచారం ఉన్నా.. ఆ తర్వాత దాని షెడ్యూల్ ఉదయానికి మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో దాడి సన్నాహాలను వేగవంతం చేశాయి.

*** ఖమేనీ నివాసంపై 30 బాంబులు..**

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ నివాస కాంప్లెక్స్ (లీడర్‌షిప్ హౌస్), సమీపంలో ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు 30 బాంబులతో దాడి చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. ఇరాన్ సైనిక, పౌర నాయకత్వాలు సంయుక్త సమావేశం నిర్వహిస్తే దాడి చేసేందుకు అమెరికా నిఘా సంస్థ కాచుకొని కూర్చొంది. ఇలాంటివి మూడు భేటీలు శనివారం జరగనున్నట్లు వాటికి ఉప్పందింది. వీటిల్లో ఖమేనీ లొకేషన్ కూడా కచ్చితంగా తెలిసింది. దీంతో తొలివిడతలోనే అమెరికా ఇజ్రాయెల్ దళాలు ఆ ప్రాంతంపై విరుచుకుపడ్డాయి. అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకొన్నా.. ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

*** ఈ దాడులకు ఆంథ్రోపిక్ ఏఐ..**

ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా ఆంథ్రోపిక్ క్లాడ్ ఏఐని వాడినట్లు వాల్‌స్ట్రీట్ కథనంలో పేర్కొంది. అనంతరం ఈ కంపెనీ టూల్స్‌ను ఫెడరల్ ఏజెన్సీల వినియోగంపై దశల వారీగా నిషేధం విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. అయినా ఇంటెలిజెన్స్ అసిస్టెన్స్, లక్ష్యాలను గుర్తించడం, యుద్ధక్షేత్ర పరిస్థితులను అంచనావేయడం వంటి సేవలకు పెంటగాన్ వినియోగించింది. ఇప్పటికే పాలంటైర్, అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో



కలిపి ఆంథ్రోపిక్ అమెరికా సైన్యానికి సేవలు అందిస్తోంది. అయితే.. అమెరికా రక్షణశాఖతో విభేదాల కారణంగా ఇటీవల ఆంథ్రోపిక్‌ను ఫెడరల్ ఏజెన్సీల్లో వాడకంపై నిషేధం విధించారు. వెనెజువెలా అధినేత మదురోను అదుపులోకి తీసుకొనే వేళ కూడా ఆంథ్రోపిక్‌ను వాడినట్లు తెలుస్తోంది. ఓపెన్ ఏఐ, గూగుల్, ఎక్స్‌ఏఐ కృత్రిమ మేధ సేవలను కూడా అమెరికా వాడుతోంది.

*** తోమహాక్ క్షిపణలు.. ఆత్మాహుతి డ్రోన్లు..**

అమెరికా తన అత్యాధునిక ఆయుధాలను ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో వాడినట్లు ఆ దేశ వార్ సెక్రటరీ పీట్ హెగ్సెత్ వెల్లడించారు. అమెరికా వాడిన వాటిల్లో స్టెల్త్‌జెట్‌లు కూడా ఉన్నాయి. ఈ దాడిలో తొలిసారి చౌకబారు వన్‌వే డ్రోన్లను అమెరికా రంగంలోకి దించడం గమనార్హం. ఇప్పటి వరకు ఇరాన్ ఈ తరహా డ్రోన్లను వాడుతూ వస్తోంది. ఇరాన్ చుట్టుపక్కల స్థావరాల నుంచి అమెరికా హిమార్స్ రాకెట్‌లను కూడా ప్రయోగించింది. సుదూరాల నుంచే లక్ష్యాలను ఛేదించే ఆయుధాలను కూడా రంగంలోకి దించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. అమెరికాలోని అరిజోనా ఫినిక్స్ కేంద్రంగా పనిచేసే స్పెక్ట్రెవర్క్స్ తయారు చేసిన LU CAS (లోకాస్ట్ అన్ మ్యాన్డ్ అటాక్ సిస్టమ్)ను ఈ దాడి కోసం రంగంలోకి దించారు. వీటి ఒక్కోదాని విలువ 35,000 డాలర్లు మాత్రమే. సెంట్‌కామ్ వీటి ఫొటోలను షేర్ చేసింది. సదరు కంపెనీ మాత్రం వీటి వినియోగంపై స్పందించలేదు. ఇక అమెరికా నమ్మకమైన ఆయుధం తోమహాక్ క్షిపణులను కూడా ఈ దాడుల్లో వాడారు. ఒక్కో క్షిపణి ఖరీదు 1.3 మిలియన్ డాలర్లు.

## చేయి కలిపిన ఎయిర్ టెల్, గూగుల్...

**గూగుల్‌తో జతకట్టిన టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్**

**స్పామ్ మెసేజ్‌లు, సైబర్ మోసాల నివారణే లక్ష్యం**

**ఆర్సీఎస్ ద్వారా హై క్వాలిటీ ఫొటోలు, వీడియోల షేరింగ్**

**కృత్రిమ మేధతో అనుమానిత లింకులు, మెసేజ్‌ల గుర్తింపు**

**వినియోగదారుల రక్షణే మా ప్రాధాన్యమన్న గోపాల్ విఠల్**




**న్యూఢిల్లీ:** దేశీయ టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్, టెక్ దిగ్గజం గూగుల్ తాజాగా కీలక ఒప్పందాన్ని ప్రకటించాయి. దేశంలోని కోట్ల మంది మొబైల్ వినియోగదారులకు మరింత సురక్షితమైన, ఆకర్షణీయమైన మెసేజింగ్ అనుభవాన్ని అందించేందుకు ఈ రెండు సంస్థలు చేతులు కలిపాయి. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్‌ను, గూగుల్ రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్ (ఆర్సీఎస్) ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించడం ద్వారా డిజిటల్ మోసాలకు చెక్ పెట్టనున్నారు.

ఈ భాగస్వామ్యం ద్వారా ఆండ్రాయిడ్ యూజర్లు 'గూగుల్ మెసేజెస్' యాప్ ద్వారానే మెరుగైన ఆర్సీఎస్ సేవలను పొందే వీలుంది. ఇందులో హై-క్వాలిటీ ఫొటోలు, వీడియోలను షేర్ చేసుకోవడంతో పాటు, మెసేజ్ రియాక్షన్స్ వంటి అధునాతన ఫీచర్లు లభిస్తాయి. అయితే వినోదంతో పాటు భద్రతకే ఈ ఒప్పందంలో పెద్దపీట వేశారు. స్పామ్ మెసేజ్‌లు, సైబర్ మోసాలను అరికట్టడానికి బలమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

ఎయిర్‌టెల్, గూగుల్ సంయుక్తంగా ఏఐ (ఏఐ) ఆధారిత స్పామ్ ఫిల్టర్లను ఉపయోగిస్తాయి. ఇవి హానికరమైన లింక్‌లను, అనుమానిత మెసేజ్‌లను ఆటోమేటిక్‌గా గుర్తిస్తాయి. అలాగే వ్యాపార సంస్థల నుంచి వచ్చే మెసేజ్‌ల విశ్వసనీయతను టెలికాం ఐడెంటిటీ ద్వారా ధృవీకరిస్తారు. వినియోగదారులు ఎంచుకున్న 'డూ నాట్ డిస్టర్బ్' (డీఎన్డీ) నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అనవసరమైన స్పామ్ మెసేజ్‌లను నిరోధిస్తారు.

ఈ సందర్భంగా భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ గోపాల్ విఠల్ మాట్లాడుతూ.. తమకు కస్టమర్ల భద్రతే అత్యంత ముఖ్యమని తెలిపారు. స్పామ్, ఆర్థిక మోసాల నుంచి వినియోగదారులను రక్షించేందుకు డేటా, ఇంటెలిజెంట్ నెట్‌వర్క్‌లను సమర్థంగా వాడుతున్నామన్నారు. ఇతర కమ్యూనికేషన్ యాప్స్ కూడా ఈ దిశగా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారతీయ యూజర్లు ఇకపై మరింత నమ్మకంతో డిజిటల్ సేవలను వాడుకోవచ్చని గూగుల్ ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్ ప్రెసిడెంట్ సమీర్ సమత్ పేర్కొన్నారు. టెలికాం స్థాయి భద్రతా ప్రమాణాలను ఆధునిక మెసేజింగ్ సేవలకు విస్తరించడమే తమ లక్ష్యమని ఇరు సంస్థలు స్పష్టం చేశాయి.

## ఫిబ్రవరి నెల జీఎస్టీ వసూళ్లలో మహారాష్ట్ర టాప్

**ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లకు చేరిన స్థూల జీఎస్‌టీ వసూళ్లు**

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా రూ.20.27 లక్షల కోట్ల ఆదాయం**

**దేశీయ రాబడి కంటే దిగుమతుల ద్వారానే అధిక వృద్ధి నమోదు**

**వసూళ్లలో మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల హవా**

**గతేడాదితో పోలిస్తే భారీగా తగ్గిన నెట్ సెస్ వసూళ్లు**




**న్యూఢిల్లీ:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఫిబ్రవరి నెలలో భారీగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నెలకు గాను రూ.1.83 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ఆదివారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఇది 8.1 శాతం అధికం కావడం విశేషం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫిబ్రవరి 28 నాటికి మొత్తం స్థూల జీఎస్టీ ఆదాయం రూ.20.27 లక్షల కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 8.3 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక ఫిబ్రవరిలో రూ.22,595 కోట్ల రీఫండ్లు చెల్లించారు. రీఫండ్లు సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.61 లక్షల కోట్లుగా నమోదైంది.


దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.3 శాతం వృద్ధితో రూ.1.36 లక్షల కోట్లుగా ఉండగా.. దిగుమతుల ద్వారా వచ్చిన రాబడిలో మాత్రం 17.2 శాతం భారీ వృద్ధి కనిపించింది. దిగుమతుల ద్వారా రూ.47,837 కోట్లు సమకూరాయి. అయితే, సెస్ వసూళు మాత్రం ఆందోళనకరంగా తగ్గాయి. గతేడాది ఫిబ్రవరిలో రూ.13,481 కోట్లుగా ఉన్న నికర సెస్.. ఈసారి రూ.5,063 కోట్లకు పడిపోయింది.

రాష్ట్రాల వారీగా చూస్తే మిశ్రమ ఫలితాలు కనిపించాయి. పారిశ్రామిక రాష్ట్రాల్లో వృద్ధి నమోదు కాగా, వనరుల ఆధారిత రాష్ట్రాల్లో వసూళ్లు తగ్గాయి. మహారాష్ట్ర రూ.10,286 కోట్ల వసూళ్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా... కర్ణాటక, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా.. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది. జీఎస్టీ 2.0 తర్వాత వసూళ్లు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ బలంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిగుమతుల రాబడి పెరగడం అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాల జోరును సూచిస్తోందని పేర్కొన్నారు.

## పెరగనున్న స్మార్ట్ ఫోన్ల ధరలు!

**వివో, ఐకూ బాటలోనే రెడ్‌మీ, పోకో బ్రాండ్లు**

**రూ.1,500 నుంచి రూ.2,500 వరకు పెరగనున్న ధరలు**



**న్యూఢిల్లీ:** స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది కొంత నిరాశ కలిగించే వార్త. ప్రముఖ స్మార్ట్ ఫోన్ బ్రాండ్లు తమ మోడళ్ల ధరలను పెంచుతున్నాయి. ఇప్పటికే వివో, ఐకూ సంస్థలు ధరల పెంపును ప్రకటించగా, తాజాగా షియోమీకి చెందిన రెడ్‌మీ, పోకో బ్రాండ్లు కూడా ఇదే బాటలో పయనిస్తున్నట్లు సమాచారం. ఈ పెరిగిన ధరలు మార్చి 1 నుంచే అమల్లోకి వస్తున్నాయి. ధరల పెంపు వల్ల ఆయా స్మార్ట్ ఫోన్ ధరలు కనిష్ఠంగా రూ.1000 నుంచి గరిష్ఠంగా రూ.2500 వరకు పెరగనున్నాయి.

టెక్ టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ పేర్కొన్న వివరాల ప్రకారం .. పోకో ఎంట్రీలెవల్ మోడల్ సీ 75 ప్రస్తుత ధర 4 జీబీ ప్లస్ 64 జీబీ వేరియంట్ ధర రూ.8,499 కాగా, ఇకపై రూ.10,999 విక్రయించనున్నారు. 4 ప్లస్ 128 జీబీ మోడల్ ధర రూ.2వేలు పెరగనుంది. వీటి మాదిరిగానే పోకో ఎం7, సీ 85 5 జీ, పోకో ఎం 7 ప్లస్ 5 జీ, పోకో ఎఫ్ 7 5 జీ మోడళ్లపై వేరియంట్ ను బట్టి రూ.1000ల నుంచి రూ.2వేల వరకు పెంచుతున్నట్లు పోకో పేర్కొంది. రెడ్ మీ కూడా ఇదే స్థాయిలో ధరలు పెంచనుందని సమాచారం. సవరించిన ధరలు మార్చి 1 నుంచే అమల్లోకి రానున్నాయి. ధరల పెరుగుదల కారణం విషయానికి వస్తే ప్రధానంగా ఏఐ డేటా సెంటర్ల నుంచి విపరీతమైన డిమాండ్ కారణంగా అంతర్జాతీయంగా మెమొరీ చిప్ ల కొరత ఏర్పడింది.

# సంజూ శాంసన్ సూపర్ ఇన్నింగ్స్...

**వరల్డ్ కప్ సెమీస్ కు దూసుకెళ్లిన భారత్**

**టి20 వరల్డ్ కప్ సూపర్-8 పోరులో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచిన భారత్**

**196 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.2 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా**

**50 బంతుల్లో 97 పరుగులతో అజేయంగా నిలిచి ఒంటిచేత్తో గెలిపించిన సంజు శాంసన్**

**మొదట బ్యాటింగ్ చేసి 195 పరుగులు సాధించిన వెస్టిండీస్**

**మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ ఆడనున్న భారత్**




**కోల్‌కతా:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈరోజు వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 196 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, సంజు శాంసన్ అద్భుత పోరాటంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో భారత్ మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌లో తలపడనుంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు షై హోప్ (32), రోస్టన్ చేజ్ (40) శుభారంభం అందించగా, చివర్లో రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్) భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 76 పరుగులు జోడించడంతో విండీస్ భారీ స్కోరు సాధించగలిగింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం 196 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఆరంభంలోనే తడబడింది. అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. అయితే వన్ డౌన్‌లో వచ్చిన సంజు శాంసన్ విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. వికెట్లు పడుతున్నా.. ఒకవైపు వికెట్ కాపాడుకుంటూనే, మరోవైపు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ యాదవ్ (18), తిలక్ వర్మ (27), హార్దిక్ పాండ్యా (17)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా సూర్యతో కలిసి 58 పరుగులు, తిలక్‌తో కలిసి 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు.

చివరి వరకు క్రీజులో నిలిచిన శాంసన్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇన్నింగ్స్ 19.2వ ఓవర్‌లో మిడ్-ఆన్ మీదుగా శాంసన్ కొట్టిన భారీ షాట్‌తో భారత్ విజయ తీరాలకు చేరింది. గెలిచిన వెంటనే మైదానంలో మోకాళ్లపై కూలబడి, ఆకాశం వైపు చూస్తూ దేవుడికి కృతజ్ఞతలు తెలిపాడు. సెంచరీకి కేవలం 3 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, జట్టును సెమీస్‌కు చేర్చానన్న ఆనందం అతనిలో కనిపించింది. చివర్లో శివమ్ దూబే (8 నాటౌట్) శాంసన్‌కు సహకరించాడు. ఈ విజయంతో గ్రూప్-1 నుంచి భారత్ దర్జాగా సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది.

**చిరస్మరణీయ శతకంతో జట్టును గెలిపించి..**

## సగర్వంగా వీడ్కోలు..!




**సిడ్నీ:** ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలీసా హీలీ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. మహిళా క్రికెట్ దిగ్గజాల్లో ఒకరైన హీలీ చిరస్మరణీయ శతకంతో జట్టును గెలిపించి.. పదహారేళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికింది. స్వదేశంలో భారత జట్టులో సిరీసే తనకు ఆఖరిదని ఇదివరకే ప్రకటించిన ఆమె.. వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సగర్వంగా ఆట నుంచి వైదొలిగింది. కెరీర్ ఆఖరి మ్యాచ్‌లో జట్టున నడిపించడం.. ఏకంగా 158 రన్స్ చేయడం.. వన్డే ఛాంపియన్ భారత జట్టుపై 3-0తో సిరీస్ విజయం నిజంగా అద్భుతమే కదా.

ఆసీస్ దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ మేనకోడలైన అలీసా హీలీ 19 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. ఆసీస్ దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ మేనకోడలైన అలీసా హీలీ 19 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. 2010లో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తను తొలి మ్యాచ్ ఆడింది. వికెట్ కీపర్‌గా, విధ్వంసక ఓపెనర్‌గా జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకున్న హీలీ మూడేళ్ల క్రితం కెప్టెన్సీ చేపట్టింది.

మేగ్ లానింగ్ వీడ్కోలు పలికిన తర్వాత బాధ్యతలు చేపట్టిన తన.. యాషెస్ సిరీస్‌లో 16-0తో ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయాల రికార్డు నెలకొల్పింది. హీలీ సారథ్యంలో ఆస్ట్రేలియా టీ20 ప్రపంచకప్‌లో, నిరుడు భారత్‌లో ముగిసిన వన్డే వరల్డ్‌కప్‌లో సెమీస్ చేరింది. ఈ 16 ఏళ్లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటివరకూ ఈ వెటరన్ బ్యాటర్ 162 టీ20లు, 126 వన్డేలు, 11 టెస్టులు ఆడింది. వికెట్ల వెనకాల చురుకుగా కదులుతూ టీ20ల్లో 126 మందిని ఔట్ చేసింది.

మనసులో ఎన్నో భావోద్వేగాలు

'భారత జట్టుతో ఆడబోయే సిరీసే నా కెరీర్లో చివరిది. సో.. మనసులో ఎన్నో భావోద్వేగాలు కలుగుతున్నాయి. నా దేశానికి ఆడడాన్ని ఇప్పటికీ ఇష్టపడుతున్నా. అయితే.. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన నాలోని పోరాట స్ఫూర్తి ఇప్పుడు తగ్గిపోయింది. అందుకే.. వీడ్కోలుకు సమయం వచ్చేసిందని భావిస్తున్నా. ఈ ఏడాది పొట్టి ప్రపంచకప్‌లో నేను ఆడడం లేదు. సన్నద్ధతకు సమయం తక్కువ ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నా. స్వదేశంలో భారత్‌తో వన్డే, ఏకైక టెస్టులో కెప్టెన్సీ వహించి నా కెరీర్‌ను ఘనంగా ముగించాలని అనుకుంటున్నా. నేను కచ్చితంగా నా సహచరులను మిస్ అవుతాను.

## బ్రెవిస్, స్టబ్స్ ధనాధన్..

**ఏడో విజయంతో సెమీస్‌కు దక్షిణాఫ్రికా..!**




**న్యూఢిల్లీ:** పొట్టి ప్రపంచకప్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్న దక్షిణాఫ్రికా అజేయంగా సెమీస్‌కు దూసుకెళ్లింది. నాకౌట్ దశలో బలమైన భారత్, వెస్టిండీస్‌ను చిత్తు చేసిన సఫారీ టీమ్.. ఆదివారం చివరి మ్యాచ్‌లోనూ పంజా విసిరింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను వణికిస్తూ.. 5 వికెట్లతో జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్(41) రెచ్చిపోగా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయతీరాలకు చేర్చారు.

రెండేళ్ల క్రితం బార్బడోస్‌లో చేజారిన ప్రపంచకప్‌ను పట్టేసేందుకు దక్షిణాఫ్రికా ఒక్కో అడుగు బలంగా వేస్తోంది. లీగ్ దశను అజేయంగా.. అపై నాకౌట్‌లోనూ వరుస విజయాలతో గ్రూప్ ఏ నుంచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన ఆ జట్టు చివరి మ్యాచ్‌లోనూ గర్జించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను ఉతికేసింది.

తొలుత ప్రత్యర్థిని 153కే కట్టడి చేసిన సఫారీలు.. ఆపై ధనాధన్ ఆటతో లక్ష్యాన్ని కరిగించారు. డెవాల్డ్ బ్రెవిస్(0 తన స్టయిల్ విధ్వంసంతో విరుచకపడి జింబాబ్వేను ఒత్తిడిలో పడేశాడు. సికిందర్ రజా(3-29) విజృంభణతో టాపార్డర్ కుప్పకూలినా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో ప్రొటీస్ విజయాన్ని పరిపూర్ణం చేశారు. దాంతో.. 5 వికెట్ల తేడాతో గెలుపొందిన మర్క్‌రమ్ సేన ఏడు విజయాలతో సెమీస్ సమరానికి సై అంటోంది.

### 18కే మూడు వికెట్లు

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ క్వింటన్ డికాక్(0)ను వెనక్కి పంపిన సికిందర్ రజా(3-29) వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. స్లో డెలివరీతో ఎడెన్ మర్క్‌రమ్(4)ను బౌల్డ్ చేసిన జింబాబ్వే సారథి.. సఫారీ హిట్టర్లను నిలువరిస్తున్నాడు. 18కే మూడు వికెట్లు పడినా.. డెవిడ్ మిల్లర్(22), డెవాల్డ్ బ్రెవిస్(41)లు దూకుడైన ఆటతో జింబాబ్వే బౌలర్లను హడలెత్తించారు.

## దుబాయ్‌లో పీవీ సింధుకు భయానక అనుభవం..

**కోచ్‌కు సమీపంలోనే పేలుడు!**

**సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌కు వెళుతుండగా ఘటన**

**తామున్న చోటుకు సమీపంలోనే పేలుడు జరిగిందని వెల్లడి**

**తన కోచ్‌కు 100 మీటర్ల దూరంలోనే ఈ ఘటన జరిగిందన్న సింధు**

**భయానక పరిస్థితుల్లోనూ తమ బృందం ధైర్యంగా నిలిచిందని వ్యాఖ్య**




**దుబాయ్:** భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు దుబాయ్‌లో ఓ ఊహించని, భయానక అనుభవం ఎదురైంది. ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వెళుతున్న సమయంలో దుబాయ్ విమానాశ్రయంలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని సింధు స్వయంగా ఓ వీడియో ద్వారా వెల్లడించారు.

బెంగళూరు నుంచి బర్మింగ్‌హామ్ వెళ్లే క్రమంలో ఆమె దుబాయ్‌లో ఆగారు. అయితే, ఆమె ప్రయాణిస్తున్న విమానం దుబాయ్‌లో ల్యాండ్ అయిన కొద్దిసేపటికే అక్కడి గగనతలాన్ని మూసివేశారు. ఆ తర్వాతి కొన్ని గంటలు చాలా ఉద్రిక్తంగా గడిచాయని ఆమె తెలిపారు. గగనతలంలో విమానాలను అడ్డగిస్తున్న శబ్దాలు వినిపించాయని, తాము ఉన్న ప్రదేశానికి చాలా సమీపంలోనే ఓ పెద్ద పేలుడు సంభవించిందని ఆమె వివరించారు.

"మీ అందరితో ఒక చిన్న అప్‌డేట్ పంచుకోవాలనుకుంటున్నాను. ఈ క్లిష్ట సమయంలో మా గురించి ఆరా తీస్తూ, బాగోగులు విచారిస్తున్న ప్రతి ఒక్కరికీ ముందుగా నా హృదయపూర్వక ధన్యవాదాలు.

నేను పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకుంటూ నివసించే బెంగళూరు నుంచి, ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడటానికి యూకేలోని బర్మింగ్‌హామ్‌కు ప్రయాణిస్తున్నాను. మా విమానం దుబాయ్‌లో ల్యాండ్ అయిన తర్వాత, మా నియంత్రణలో లేని కొన్ని సంఘటనలు జరగడం మొదలైంది. కొద్దిసేపటికే గగనతలాన్ని పూర్తిగా మూసివేశారు.

గడిచిన కొన్ని గంటలు అత్యంత ఉద్రిక్తంగా గడిచాయి. గగనతల దాడులను అడ్డుకునే క్షిపణుల శబ్దాలు మా తలల మీదుగా వినిపించాయి. ఆ తర్వాత కొద్ది గంటలకే, మేము దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న ప్రదేశానికి చాలా దగ్గరలో ఒక పెద్ద పేలుడు సంభవించింది. ఆ పేలుడు జరిగిన చోటుకు నా కోచ్ కేవలం 100 మీటర్ల దూరంలోనే ఉన్నారు. వెంటనే ఆయన ఆ ప్రాంతం నుంచి వేగంగా బయటకు వెళ్లాల్సి వచ్చింది.

ఇంత దగ్గరగా ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కోవడం నిజంగా మనల్ని కుదిపేస్తుంది. ఇలాంటివి మనకు గానీ, మనకు దగ్గరైన వారికి గానీ జరుగుతాయని మనం ఎప్పుడూ ఊహించం. కానీ కొన్నిసార్లు పరిస్థితులు మన చేతుల్లో ఉండవు. ఇంత బలమైన, ఐకమత్యంగా ఉండే జట్టు నా చుట్టూ ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ భయంకరమైన పరిస్థితిలో కూడా ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండి, ఒకరికొకరు మద్దతుగా నిలుస్తూ నిజమైన ధైర్యాన్ని ప్రదర్శించారు" అని సింధు ఆ వీడియోలో వెల్లడించారు.

# రాజకీయాలకి షార్ట్ బ్రేక్..

### తిరిగి సినిమాలతో బిజీ అవుతున్న రోజా



**టాకీస్:** ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించిన రోజా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత సినిమాలకు దూరమయ్యారు. మధ్యలో కొంతకాలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కనిపించినప్పటికీ, పూర్తి స్థాయిలో రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఇప్పుడు మరోసారి కెమెరా ముందుకు వచ్చి రీ ఎంట్రీ ఇవ్వడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.సినిమాలు మానేసినా రోజా ప్రేక్షకులకు దూరం కాలేదు. ప్రముఖ టీవీ షో జబర్దస్త్ ద్వారా ఆమె ఎప్పటికప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చేవారు. ఆ తర్వాత గత ప్రభుత్వంలో మంత్రి బాధ్యతలు స్వీకరించడంతో ఆ షోకు కూడా గుడ్‌బై చెప్పారు. అయితే ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత రోజా మళ్లీ టీవీ కార్యక్రమాల్లో కనిపించడం ప్రారంభించారు. ఇప్పటికే పలు తెలుగు టీవీ షోలలో గెస్ట్‌గా హాజరవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇప్పుడు సినిమాల్లోనూ రీ ఎంట్రీకి సిద్ధమయ్యారు రోజా. తెలుగులో చివరిసారిగా 2013లో, తమిళంలో 2015లో నటించిన ఆమె, దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ తమిళ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఆమె నటించిన తమిళ సినిమా అంబే దయానా టీజర్ విడుదలైంది. ఈ చిత్రంలో పారి ఎలవజగన్, రమ్య రంగనాథన్ జంటగా నటిస్తున్నారు. రోజా ఈ సినిమాలో హీరో తల్లి పాత్రలో కనిపించనున్నారు. టీజర్‌లో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. మరోసారి తల్లి పాత్రలో ఆమె తన అనుభవంతో అద్భుతంగా నటించినట్టు టీజర్ చూస్తేనే అర్థమవుతోంది.

### మిక్స్‌డ్ టాక్ నుంచి

# 'విష్ణు విన్యాసం'కి పాజిటివ్ టాక్..

### రెండో రోజు కలెక్షన్లు జోరు




**టాకీస్:** టాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన హీరో శ్రీవిష్ణు నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దర్శకుడు యదునాథ్ మారుతిరావు తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ చిత్రంలో నయన సారిక హీరోయిన్‌గా నటించారు. వినోదంతో పాటు కుటుంబ భావోద్వేగాలను మేళవించిన కథగా మేకర్స్ ప్రచారం చేశారు.ఫిబ్రవరి 27, 2026న విడుదలైన ఈ సినిమా మొదటి రోజు నుంచి మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. శ్రీవిష్ణు కామెడీ టైమింగ్‌ను కొంతమంది ప్రేక్షకులు మెచ్చుకున్నప్పటికీ, కథనం బలహీనంగా ఉందని, స్క్రీన్‌ప్లే ఆసక్తికరంగా లేదని విమర్శలు వచ్చాయి.

కామెడీ ట్రాక్ పాత తరహాలో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హీరోయిన్ పాత్రను మరింత బలంగా తీర్చిదిద్దాల్సిందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో తొలి రోజు థియేటర్ల వద్ద ఆశించిన స్థాయి ఓపెనింగ్స్ కనిపించలేదు. అయితే రెండో రోజు పరిస్థితి పూర్తిగా మారింది. పాజిటివ్ మౌత్ టాక్ క్రమంగా పెరగడంతో ఫ్యామిలీ ఆడియన్స్, యువత థియేటర్లకు రావడం ప్రారంభించారు. ట్రేడ్ అంచనాల ప్రకారం రెండో రోజు ఆక్యుపెన్సీ సుమారు 54 శాతం వరకు పెరిగినట్టు సమాచారం. మొదటి రోజు సుమారు 31.2 వేల టికెట్లు అమ్ముడవగా, రెండో రోజు ఆ సంఖ్య 48.1 వేల వరకు చేరినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

### 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'

# ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..

**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రానికి ఓటీటీ రిలీజ్‌కు లైన్ క్లియర్ అయింది. 2026 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ప్లాట్‌ఫామ్ మార్చి 13 నుంచి స్ట్రీమింగ్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో రవితేజ అభిమానుల్లో మరోసారి ఉత్సాహం నెలకొంది. ప్రేమకథా చిత్రాలకు పేరున్న



పండగ సీజన్‌లో భారీ సినిమాల పోటీ కారణంగా ఈ చిత్రం 'బిలో యావరేజ్' టాక్‌తో సరిపెట్టుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలో రిలీజ్ డేట్ విషయంలో చాలా కాలం నుండి సస్పెన్స్ కొనసాగుతూ వస్తుంది. మొదటగా ఈ సినిమా ఫిబ్రవరి 13న ఓటీటీలో విడుదల కావాల్సి ఉండగా, సాంకేతిక కారణాల వల్ల స్ట్రీమింగ్ వాయిదా పడింది. ఆ తరువాత ఫిబ్రవరి 27, మార్చి 6 అంటూ పలు తేదీలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే తాజాగా ఈ చిత్రానికి డిజిటల్ హక్కులు దక్కించుకున్న జీ5 దర్శకుడు కిషోర్ తిరుమల ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో రవితేజ ఒక సంపన్న వ్యాపారవేత్త పాత్రలో కనిపించారు. వ్యాపార పనుల నిమిత్తం తరచుగా యూరప్‌కు వెళ్లే ఆయన, అక్కడ ఓ యువతితో పరిచయం పెంచుకుంటాడు. ఆ పరిచయం ప్రేమగా మారడంతో అతని వైవాహిక జీవితంలో సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడతాయి.




# పెళ్లిపై స్పందించిన త్రిష..

### నచ్చిన వ్యక్తి దొరికినప్పుడేనంటూ ఆసక్తికర వ్యాఖ్యలు

టాకీస్: దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ మరోసారి తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. నటనతో పాటు తన వ్యక్తిత్వంతోనూ ప్రత్యేక గుర్తింపు పొందిన త్రిష పెళ్లి, విడాకులు, సహజీవనం వంటి అంశాలపై గతంలో వెల్లడించిన అభిప్రాయాలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో "మీ పెళ్లి ఎప్పుడు?" అనే ప్రశ్నకు త్రిష స్పష్టమైన సమాధానం ఇచ్చారు. "చాలామంది నన్ను పెళ్లి గురించి అడుగుతుంటారు. కానీ నాకు ఒకటే సమాధానం ఉంది. నాకు నచ్చిన, సరైన వ్యక్తి దొరికితేనే నేను పెళ్లి చేసుకుంటాను. ఒకవేళ అలాంటి వ్యక్తి దొరకకపోతే పెళ్లి జరగకపోయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు," అని ఆమె తెలిపారు. త్రిష వ్యాఖ్యల్లో స్పష్టత, ఆత్మవిశ్వాసం కనిపించాయి. పెళ్లి అనేది కేవలం సమాజం కోసం తీసుకునే నిర్ణయం కాదని, జీవితాంతం కలిసి జీవించగలమనే నమ్మకం కలిగినప్పుడే ఆ అడుగు వేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. "నేను పెళ్లి చేసుకుంటే అది విడాకుల వరకు వెళ్లకూడదని భావిస్తున్నాను. అందుకే తొందరపడి ఎలాంటి తప్పుడు నిర్ణయం తీసుకోను," అని త్రిష వివరించారు. తన స్నేహితుల్లో చాలామంది ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని బాధపడుతున్నారని, అలాంటి జీవితం తనకు వద్దని ఆమె స్పష్టం చేశారు.ఇష్టం లేని వ్యక్తితో కలిసి నరకం అనుభవించడం కంటే ఒంటరిగా ఉండటం మేలని త్రిష అభిప్రాయపడ్డారు. ప్రేమలో పడటం కంటే తన జీవితాన్ని పంచుకోగలిగే మంచి భాగస్వామి కావాలని, తనకు నచ్చిన వ్యక్తితో సంతోషంగా జీవించడమే తన లక్ష్యమని తెలిపారు. త్రిష చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఆమె అభిప్రాయాలకు కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు వివిధ కోణాల్లో స్పందిస్తున్నారు. అయితే పెళ్లి విషయంలో సమాజపు ఒత్తిడికి లోనుకాకుండా, తన నిర్ణయాన్ని తాను తీసుకోవాలనే సందేశాన్ని త్రిష స్పష్టంగా ఇచ్చారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉంటే, త్రిష ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కెరీర్ పరంగా వరుస అవకాశాలతో దూసుకుపోతూనే, వ్యక్తిగత జీవితం విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారని చెప్పాలి. కాగా, ఈ మధ్య విజయ్ డైవర్స్ ఇష్యూలో త్రిష పేరు బయటకు రావడం హాట్ టాపిక్ అయిన విషయం విదితమే.

MOVIE TIME

### సాంగ్ రిలీజ్‌కు ముందే

# రాంచరణ్ మరో సర్‌ప్రైజ్..



### పెద్ది నయా పోస్ట్ వైరల్


**టాకీస్:** కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ పెద్ది ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన దర్శకత్వం వహిస్తున్నాడు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్నఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన చికిరి చికిరి సాంగ్ ఇండియాతోపాటు వరల్డ్‌వైడ్‌గా మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. కాగా మేకర్స్ ఇక సెకండ్ సింగిల్ 'రై రై రా రా'సాంగ్‌ను రేపు లాంచ్ చేయనుండగా అభిమానులు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు.

ఇదిలా ఉంటే రాంచరణ్ ఊహించని సర్‌ప్రైజ్ ఒకటి సోషల్ మీడియా ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నాడు. అయితే ఈ సారి సాంగ్ గురించి కాకుండా సినిమాకు డబ్బింగ్ చెబుతున్న విషయాన్ని షేర్ చేశాడు. స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న వీడియో క్లిప్ ఒకటి షేర్ చేయగా.. డైరెక్టర్ బుచ్చిబాబు రాంచరణ్‌కు డైలాగ్స్ వివరిస్తుండటం చూడొచ్చు. ఇప్పుడీ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.

పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పెద్ది ఏప్రిల్ 30న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

# సమానత్వం అనేది ఎజెండా కాదు.. అది మన హక్కు : షెఫాలీ షా

**టాకీస్:** లింగ సమానత్వం, సామాజిక బాధ్యతలపై ప్రముఖ బాలీవుడ్ నటి షెఫాలీ షా చేసిన సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఒక ఈవెంట్‌లో భాగంగా షెఫాలీ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా ఉండటం అనేది ఏదో ఒక పట్టుదలతో సాధించాల్సిన 'ఎజెండా' కాదని, మనకు నచ్చినట్లుగా, సౌకర్యంగా జీవించడమే అసలైన సమానత్వమని షెఫాలీ షా అన్నారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడటం చాలా కీలకమని పేర్కొన్న ఆమె, ముఖ్యంగా చదువు మరియు ఆర్థిక స్వతంత్రత ఉంటేనే సమాజంలో మహిళలకు ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని నొక్కి చెప్పారు. పిల్లల పెంపకం గురించి మాట్లాడుతూ.. ఆ బాధ్యత కేవలం తల్లులదే కాదని, ఇందులో తండ్రుల పాత్ర కూడా సమానంగా ఉండాలని ఆమె అన్నారు. తండ్రి ఇంట్లోని మహిళలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో చూసే పిల్లలు ప్రవర్తనను నేర్చుకుంటారని, అందుకే అబ్బాయిలను చిన్నప్పటి నుంచే మహిళల పట్ల గౌరవంగా ఉండేలా పెంచాలని ఆమె సూచించారు. మహిళల భద్రత అనేది కేవలం చట్టాల ద్వారానే కాకుండా, ఇంట్లోని సంస్కృతి నుంచే ప్రారంభం కావాలని ఆమె కోరారు. ప్రస్తుతం 'ఢిల్లీ క్రైమ్', 'డార్లింగ్స్' వంటి సక్సెస్‌లతో కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న షెఫాలీ షా, త్వరలో 'లవ్ అండ్ వార్' వంటి భారీ చిత్రంలో నటిస్తుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.